IN MEDIA PUBLICATION PVT LTD
MV NEWS
@vaartanews @mvnewstv
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.mivaartanews.com
TGBIL/25/A0512
శనివారం
29 ఆగస్టు 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
సంపుటి : 02
సంచిక :58
పేజీలు : 12 వెల : 5/-




PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |

# రేవంత్ రెడ్డికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది



- సీఎంకు బంగారు రాఖీ కట్టిన కొండా సురేఖ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన కొండా సురేఖ
- తాను అందరికీ సోదరినేనని వ్యాఖ్య

హైదరాబాద్

రక్షాబంధన్‌ను పురస్కరించుకొని మంత్రులు కొండా సురేఖ, సీతక్క సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు. పరకాల వివాదం తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ రేవంత్ రెడ్డికి బంగారు రాఖీ కట్టారు. ఆయనతో పాటు కుటుంబసభ్యులకూ రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా 'సీఎం రేవంత్ రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. సీఎం మనవడు, అల్లుడికి కూడా రాఖీ కట్టాను. - మిగతా3లో



## శాంతియుత పరిష్కారానికి ఇరుదేశాలు అంగీకారం

- భారత్–చైనా సరిహద్దు వివాదం
- సరిహద్దు ఒప్పందంపై భారత్–చైనా చర్చలు
- త్వరలోనే సానుకూల ఫలితాలు– భారతవిదేశాంగ శాఖ వెల్లడి
- సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో వీలైనంత త్వరగా మంచి ఫలితాలు సాధించాలని ఇరుదేశాలు నిర్ణయించాయి

## రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా

# వాదించండి

- నీటిపారుదలశాఖ సమీక్షలో సీఎం దిశానిర్దేశం
- అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- సుప్రీంకోర్టు, సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీలో వాదించాల్సిన అంశాలపై సమీక్ష
- మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని ఆదేశం



హైదరాబాద్

అంతర్రాష్ట్ర జల వివాదాలపై వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై చర్చించినట్లు తెలుస్తోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి?, ఇతర రాష్ట్రాల వాదనలేంటి, తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు సమాచారం. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. - మిగతా3లో



## నేపాల్‌లో 579 మంది మృతి

- కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు
- 1924 మంది గల్లంతు
- రసువా జిల్లాలో కొన్ని అడుగుల ఎత్తున మొదలైన వరద, బురద ప్రవాహం
- దిగువకు ప్రవహించి పలు జిల్లాల్లో బీభత్సం
- పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి
- వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి
- టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి.

## చైనాలో భూకంపం



- రిక్టర్‌స్కేల్‌పై 5.1 తీవ్రతతో నమోదు
- నేపాల్‌లో మరో హెచ్చరిక జారీ
- చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో భూకంపం
- భూమికి 13 కి.మీ. లోతులో ప్రకంపనలు
- వరద ప్రవాహం పెరిగే అవకాశం
- రెస్క్యూ టీమ్‌ను వెనక్కి రప్పిస్తున్న అధికారులు

## లక్కీడ్రాతోనే క్యూర్ పరిధిలో

# ఇందిరమ్మ ఇళ్లు




- మరో 10 రోజుల్లో రెండో విడత : పొంగులేటి
- అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తున్నామన్న మంత్రి పొంగులేటి
- మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడి
- నాంపల్లి, రాజేంద్రనగర్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో నేడు లబ్ధిదారుల ఎంపిక

హైదరాబాద్

తెలంగాణలో ప్రభుత్వం తరఫున ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తూ, అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయిస్తున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆయన మాట్లాడారు. నాంపల్లి, రాజేంద్రనగర్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామన్న ఆయన, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటి వరకు హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తి చేసినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణం ప్రారంభిస్తారని, వాటిని ఏడాదిలోపే పూర్తి చేసి ఆడబిడ్డల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి? ఇస్తామని ప్రకటించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. 10 సంవత్సరాల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు వస్తుందని చెప్పారు. ఇల్లు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే - మిగతా3లో

## సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యత

- నెల జీతం విరాళంగా ఇచ్చిన నేపాల్ మంత్రులు
- నేపాల్‌లో వరద సహాయక చర్యలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్ష
- నేపాల్ వరదల బాధితులను ఆదుకునేందుకు ప్రధాని, మంత్రుల కీలక నిర్ణయం

# మీ పేర్లు మేం చదవలేం



## సర్ జాబితాలో ఓటర్ల చిక్కులు

- చాయ్ తాగి – బిస్కెట్ తిని సాదాసీదాగా వెళ్లిపోయారు 'సర్?'!
- 20 పోలింగ్ కేంద్రాలను కలిపి ఒకేచోట సమావేశాలు
- అధికారులు ఫొటోలు దిగి, చాయ్ తాగి, బిస్కెట్లు తిని వెళ్లిపోయారని విమర్శలు
- పాతబస్తీలో పరిస్థితి మరీ దారుణం

హైదరాబాద్

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాపై గురువారం జరిగిన గ్రామ సభలు సాదాసీదాగా ముగిశాయి. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల సంఘం ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని ఆదేశించినా కానీ ఏ ఒక్క పోలింగ్ కేంద్రంలోనూ అధికారులు ఓటరు జాబితా చదవలేదు. అంతేకాదు కొన్ని సభల్లో ఫారాలను సైతం తీసుకుని రాలేదు. ఫొటోలు దిగి, చాయ్ తాగి, బిస్కెట్లు తిని వెళ్లిపోయారని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 36,353 - మిగతా3లో

# చైనాలో భూకంపం

చైనాలోని సిచువాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో పొరుగున ఉన్న నేపాల్‌కు శుక్రవారం మరో వరద హెచ్చరిక జారీ అయింది. భూకంప దాటికి చైనా, నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆనకట్ట తెగిపోయిందని పోలీసులు భావిస్తున్నారు. అలాగే, ఎగువ నుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం నది నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉన్నందున, నేపాల్‌లోని ప్రభావిత ప్రాంతమైన త్రిశూలి ప్రాంతాన్ని మరోసారి ఖాళీ చేయిస్తున్నట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం సంభవించిన ఈ భూకంపం భూమికి 13 కి.మీ. లోతులో సంభవించినట్లు తెలుస్తోంది. పైనుంచి బురదతో కూడిన నీటి ప్రవాహం వేగంగా వస్తుండటంతో, నేపాల్‌లోని త్రిశూలి పరివాహక ప్రాంతాన్ని అధికారులు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంటున్న సైన్యం, భద్రతా సిబ్బంది, స్థానిక ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని నేపాల్ పోలీసులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా, చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని లాంగ్‌చాంగ్ నగరాన్ని భూకంపం కుదిపేసిందని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ తెలిపినట్లు నివేదించింది.

మరోవైపు, నేపాల్‌లో వరద వల్ల నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. కాబట్టి సహాయక చర్యల్లో పాల్గొన్న వాహనాలను వెనక్కి తిరిగివస్తున్నాయని చెప్పారు. నేపాల్?కు మరో తీవ్రమైన వరద ముప్పు పొంచి ఉందని అన్నారు. పైనుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం వల్ల నేపాల్‌లోని త్రిశూలి ప్రాంతంలో ప్రజలను మరోసారి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. అలాగే, నేపాల్- చైనా సరిహద్దు సమీపంలో భోటే కోషి నది దిగువన ఉన్న ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని నేపాల్ జలవిజ్ఞాన, వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ సరస్సులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రానున్న మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు అందులోకి చేరే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆనకట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌కు తెలియజేశారు.



**ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ చర్యల్లో పాల్గొన్న భద్రతా దళాలు**

మరోవైపు, భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ నేపాల్ సైన్యం సహాయక చర్యలను కొనసాగిస్తోందని ప్రతిపక్ష నాయకుడు భీష్మరాజ్ పేర్కొన్నారు. త్రిశూలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "సైన్యం, హెలికాప్టర్ బృందం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ఈ ఆపరేషన్‌లో రెండు సైనిక హెలికాప్టర్‌లతో పాటు, ఇతర ప్రైవేటు రంగానికి చెందిన మరికొన్నింటిని రంగంలోకి దించారు. అందుబాటులో ఉన్న ప్రతి వనరునూ వినియోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ అధికారి మీడియాతో మాట్లాడారు. తాము కాఠ్మండు నుంచి వచ్చామని, ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వం, నేపాల్ ప్రభుత్వం రెండూ కలిసి శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమై ఉందని పేర్కొన్నారు.

**పెరుగుతున్న మృతుల సంఖ్య**

నేపాల్‌లోని రసువా జిల్లాలో సంభవించిన వినాశకరమైన ఆకస్మిక వరదల కారణంగా మృతుల సంఖ్య శుక్రవారం నాటికి 469కి చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుమారు 1,545 మంది గాయపడ్డారని నేపాల్ పోలీసులు తెలిపారు. అత్యధికంగా చిత్వాన్ జిల్లాలో 178 మృతదేహాలు లభ్యమయ్యాయని, ఆ తర్వాత ఎన్‌పీ ఈస్ట్‌లో 110, గోర్ఖాలో 44, నువాకోట్‌లో 37, ధాడింగ్‌లో 33, తనాహున్‌లో 28, ఎన్‌పీ వెస్ట్‌లో 27, రసువాలో 12 మృతదేహాలు దొరికాయని చెప్పారు. వరద బురదలో చిక్కుకుపోయిన తర్వాత బయటపడిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, ఒక స్థానికుడు ఇలా అన్నారు. "మేం చాలా బురదలో చిక్కుకుపోయాము. మా ఇళ్లు, దుకాణాలు, సామాన్లను అన్నింటిని కోల్పోయాం. మేం మా పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో మొదట భూమి కదలడం గమనించాం. కానీ, అది సాధారణమేనని భావించాం. కానీ త్రిశూలి, ధోబీ వాగుల నుంచి నీరు 50 అడుగుల ఎత్తున ఉప్పొంగడం చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యాం. అందులో పడి చాలా మంది కొట్టుకుపోయారు. త్రిశూలి మార్కెట్ ప్రాంతంలో ఒక్క మనిషి కూడా మిగల్లేదు. మేము ఎలాగోలా తప్పించుకోగలిగాము" అని ఆందోళన వ్యక్తం చేశారు.

# శాంతియుత పరిష్కారానికి ఇరుదేశాలు అంగీకారం

భారత్, చైనా మధ్య జరుగుతున్న సరిహద్దు చర్చలు(ఎర్లీ హార్వెస్ట్) గురించి భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం కీలక విషయాలు వెల్లడించారు. ఈ చర్చల ద్వారా ఇరుదేశాలు సరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా, ఇరుపక్షాలకు ఆమోద యోగ్యమైన, సహేతుకమైన, న్యాయమైన రీతిలో పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2005లో ఏర్పరుచుకున్న మార్గదర్శకాలు, నియమ, నిబంధల ప్రకారమే, ఈ చర్చలు ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో వీలైనంత త్వరగా మంచి ఫలితాలు సాధించాలని ఇరుదేశాలు నిర్ణయించాయని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఇందుకోసం ఔవీజజ (సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ మెజానిజం) పరిధిలోని సరిహద్దు గుర్తింపు నిపుణుల కమిటీ తన చర్చలు మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీని ద్వారా సరిహద్దు గుర్తింపు ప్రక్రియలో వీలైనంత త్వరగా సానుకూల ఫలితాలు సాధించేలా ఇరుదేశాలు ముందడుగు వేయనున్నాయని ఆయన వెల్లడించారు.



**నేపాల్‌లోని భారత పర్యటకుల పరిస్థితి ఏంటి?**

మరోవైపు నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సురక్షితంగా బయటపడిన భారత పర్యటకులను, ఆ దేశంలోని భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ త్రిభువన్ శుక్రవారం కలుసుకున్నారు. కాఠ్?మండు నుంచి ఇండిగో విమానంలో భారత్‌కు తిరుగు ప్రయాణమైన భారతీయ పౌరులకు ఆయన వీడ్కోలు పలికారు. ఈ విషయాన్ని నేపాల్?లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. నేపాల్?లోని రుసువా, ధాడింగ్, నువాకోట్? సహా ఇతర ప్రాంతాల్లో భారీ ఆకస్మిక వరదల వల్ల వందలాది మంది మరణించగా, మరెందరూ గల్లంతయ్యారు. ఇళ్లు, వంతెనలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు, రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. అయితే వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 85 మంది భారతీయులతో సహా కనీసం 121 మంది విదేశీ పర్యటకులను భద్రతా దళాలు రక్షించినట్లు నేపాల్ టూరిజం బోర్డు శుక్రవారం తెలిపింది. నేపాల్ టూరిజం బోర్డు ఇచ్చిన సమాచారం ప్రకారం, భద్రతా దళాలు కాపాడిన పర్యటకులలో 9 మంది దక్షిణ కొరియా పౌరులు, 16 మంది చైనా పౌరులు కూడా ఉన్నారు. శుక్రవారం నాటికి ఉన్న సమాచారం ప్రకారం, నేపాల్ వరదల్లో చిక్కుకుని మరణించిన వారి సంఖ్య 538కి పెరిగింది. మరోవైపు ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో 2.391 మంది నేపాల్ ఆర్మీ సిబ్బందితో పాటు, మొత్తం 7,451 మంది భద్రతా సిబ్బందిని నేపాల్ రంగంలోకి దింపింది.

**మరోసారి ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం?**

నేపాల్?ను ఇప్పటికే ఆకస్మిక వరదలు అతలాకుతలం చేయగా, నీటి మట్టాలు పెరగడం వల్ల మరోసారి వరదలు వచ్చే ప్రమాదం ఉందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్?డీఆర్?ఆర్?ఎంఏ) శుక్రవారం వెల్లడించింది. అందువల్ల భోటెకోశి, త్రిశూలి ప్రాంతాల్లోని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

**భారత్‌లోకి కొట్టుకువస్తున్న మృతదేహాలు**

మరోవైపు నేపాల్‌ను ముంచెత్తిన వరదలు వల్ల మరణించిన వారి మృతదేహాలు ఇప్పుడు మన దేశంలోని నదుల్లోకి కొట్టుకొస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్, బిహార్‌లోని వాల్మీకి నగర్ బ్యారేజ్ వద్ద ఇప్పటివరకు 5 మృతదేహాలు లభ్యమయ్యాయి. ముఖ్యంగా యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లా పరిధిలో గండక్ నదిలో నాలుగు గుర్తుతెలియని మృతదేహాలను సశస్త్ర సీమా బల్ బలగాలు వెలికితీశాయి. అవి తీవ్రంగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయని, వాటిని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించామని అధికారులు తెలిపారు. అటు బిహార్‌లోని వాల్మీకి నగర్ బ్యారేజ్ వద్ద కూడా మరో మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాలు నేపాల్ వరదల్లో గల్లంతైన వారివేనా లేదా అనేది నిర్ధరించేందుకు ఆ దేశ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు భారత అధికారులు వెల్లడించారు.

## సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యత

వరదలతో అతలాకుతలమైన పొరుగుదేశం నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక, గాలింపు చర్యలపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత పరిస్థితులపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్షించారు. నేపాల్‌లో సహాయక చర్యలకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు నేపాల్ మంత్రులు తమ నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాఠ్‌మాండూ, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నట్లు జైశంకర్ తెలిపారు. నేపాల్‌లో ఉన్న భారతీయుల క్షేమం, ప్రస్తుత పరిస్థితిపై తాజా సమాచారం సేకరించినట్లు పేర్కొన్నారు. నేపాల్‌కు మరింత సహాయ సామగ్రి పంపే అంశంపైనా విదేశాంగ శాఖలోని సంబంధిత విభాగాలతో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. ఇప్పటికే భారత్ సహాయ చర్యల్లో భాగస్వామ్యం కాగా, అవసరమైన మరిన్ని వస్తువులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా, ఆయన మంత్రివర్గ సహచరులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ఒక నెల జీతాన్ని ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. రసువా జిల్లాలోని భోటే కోశీ ప్రాంతంలో వరదల వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యలు, పునరావాసం, పునర్నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. వరదలతో నష్టపోయిన వ్యక్తులు, వ్యాపార సంస్థలకు ప్రత్యేక సహాయ, పునరావాస ప్యాకేజీ సిద్ధం చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ఇబ్బందులు తలెత్తకుండా నేపాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులను ప్రభుత్వాల మధ్య ఒప్పందం (+2+) విధానంలో కొనుగోలు చేసేందుకు కృషి సామగ్రి కంపెనీ లిమిటెడ్‌కు సూత్రప్రాయ అనుమతి ఇచ్చింది. వరదల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతినడం, పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడటంతో ఎరువుల సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

**జిన్‌పింగ్ అధ్యక్షతన అత్యవసర సమీక్ష**

నేపాల్-టిబెట్? సరిహద్దు వరదలపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన, సహాయక, గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విపత్తులో మృతిచెందిన వారికి సంతాపంగా సమావేశంలో జీ జిన్‌పింగ్, ఇతర నేతలు కొద్దిసేపు మౌనం పాటించారు. గల్లంతైన చైనా, విదేశీ పౌరులందరినీ గుర్తించి రక్షించేందుకు శాస్త్రీయంగా గాలింపు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**భారత్-నేపాల్ వాణిజ్యానికి వరద దెబ్బ**

వరదల ప్రభావం భారత్-నేపాల్ సరిహద్దు వాణిజ్యంపైనా పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సోనౌలి సరిహద్దు వద్ద నేపాల్‌లోకి వెళ్లాల్సిన సరకు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. భారత వైపు సుమారు 16 కిలోమీటర్ల మేర ట్రక్కుల క్యూ ఏర్పడింది. కాఠ్?మాండూ సహా నేపాల్‌లోని వివిధ ప్రాంతాలకు సరుకులు తీసుకెళ్లే వాహనాలు రహదారులు దెబ్బతినడంతో ముందుకు కదలలేకపోతున్నాయి. రాకపోకలు ఆలస్యమైతే ఇరు దేశాల మధ్య సరకు సరఫరాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు.

## నేపాల్‌లో 579 మంది మృతి..



**నేపాల్ :** నేపాల్ వరదల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను రెస్క్యూ బృందాలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 579 మృతదేహాలు వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఈ విపత్తులో ఇప్పటివరకు 1473 మంది గాయాలపాలైనట్లు పేర్కొన్నారు.

**320 మంది భారతీయులు గల్లంతు..**

మరోవైపు, నేపాల్‌లో 320 మంది భారతీయుల ఆచూకీ ఇంకా తెలియలేదని భారత విదేశాంగశాఖ వెల్లడించింది. చైనా వైపు 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని, వారిలో 96 మంది రోడ్డు మార్గంలో సురక్షితంగా నేపాల్‌లోకి ప్రవేశించారని పేర్కొంది. మరో 21 మంది కాఠ్‌మాండూ నుంచి దిల్లీకి చేరుకున్నారని తెలిపింది.

**కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు..**

నదీ పరివాహక ప్రాంతంలో మృతదేహాలను వెలికితీసే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లాలో నాలుగు, కుషీనగర్ జిల్లాలో మూడు మృతదేహాలు లభ్యమయ్యాయని అధికారులు వెల్లడించారు. ఇవి నేపాల్ నుంచి కొట్టుకువచ్చినట్లు భావిస్తున్నామని మహారాజ్‌గంజ్ జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ సింగ్ సోగార్వాల్ తెలిపారు. ఈ మృతదేహాలు ఎవరివనే విషయం ఇంకా నిర్ధరణ కాలేదని, ఇదే విషయంపై నేపాల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు.

**చైనా వైపు 558 మంది..**

టిబెట్‌లోని చైనా-నేపాల్ సరిహద్దులో ఉన్న గీరోంగ్ కౌంటీలో సంభవించిన ఆకస్మిక వరదల్లో 558 మంది గల్లంతైనట్లు చైనా వెల్లడించింది. ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. గల్లంతైన వారిలో 260 మంది విదేశీయులే ఉన్నారని పేర్కొన్నప్పటికీ వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇదిలా ఉంటే, టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించింది.

## 1.77 అంగుళాలు వంగిన భాక్రా నంగల్ డ్యామ్ గోడ - క్లారిటీ ఇచ్చిన కేంద్రం



పంజాబ్‌లోని భాక్రా నంగల్ డ్యామ్ గోడ 1.77 అంగుళాలు వంగిందని సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. ఒకవేళ డ్యామ్ తెగిపోతే దిల్లీ సహా పలు నగరాలు మునిగిపోతాయనే భయాలు ఈ వీడియో వల్ల రేకెత్తాయి. అయితే ఈ విషయంపై ప్రభుత్వ అధికారిక నిజ నిర్ధరణ విభాగమైన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) కీలక ప్రకటన చేసింది. ఈ వాదనను పూర్తిగా తప్పుదోవ పట్టించేదిగా, అవాస్తవమైనదిగా పేర్కొంది. 2026 ఆగస్టు 27న భాక్రా నంగల్ డ్యామ్ గోడలో నమోదైన అసలు కదలిక కేవలం 0.86 అంగుళాలు మాత్రమేనని పీఐబీ స్పష్టం చేసింది. ఇది ఇంజినీరింగ్ భద్రతా ప్రమాణాల ప్రకారం నిర్దేశించిన సాధారణ పరిధిలోనే ఉందని వెల్లడించింది.

**వదంతులను, తప్పుడు వార్తలను నమ్మొద్దు!**

మరోవైపు, భాక్రా నంగల్ డ్యామ్ నిర్మాణాత్మకంగా పటిష్టంగానే ఉందని అధికారులు, నిపుణులు తెలిపారు. దాని స్థిరత్వానికి ఎలాంటి ముప్పు లేదని ధ్రువీకరించారు. ఈ ఆనకట్టను ప్రపంచంలోనే అత్యంత ప్రధానమైన డ్యామ్‌ల్లో ఒకటిగా పరిగణిస్తారని వెల్లడించారు. ఒత్తిడి, రంధ్ర పీడనం, లీకేజీ వంటి కీలక నిర్మాణ భద్రతా సూచికలు నిర్దేశించిన సురక్షిత పరిమితుల్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. కాగా, భాక్రా నంగల్ డ్యామ్ భద్రతపై సోషల్ మీడియాలో ప్రచారంలో అవుతున్న వీడియోలను, భయాందోళనలు సృష్టించే వదంతులను నమ్మొద్దని పీఐబీ, పంజాబ్ ప్రభుత్వం ప్రజలను కోరాయి. భాక్రా నంగల్ ఆనకట్ట భద్రతకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక, ధ్రువీకరించిన మూలాల నుంచి వచ్చిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేశాయి. పీఐబీ, అధికారులు ప్రకటనతో భాక్రా నంగల్ డ్యామ్ గోడ వంగిందన్న దుష్ప్రచారానికి తెరపడింది.

**కొన్నాళ్ల క్రితం మంత్రి ప్రకటన**

కొద్ది రోజుల క్రితం పంజాబ్ జలవనరుల శాఖ మంత్రి బరీందర్ కుమార్ గోయల్ కూడా రాష్ట్ర అసెంబ్లీలో భాక్రా నంగల్ డ్యామ్ గురించి ప్రసంగించారు. ఈ క్రమంలో ఆనకట్ట భద్రతపై ఉన్న ఆందోళనలను తగ్గించేందుకు ప్రయత్నించారు. భాక్రా నంగల్ డ్యామ్ గోడలో తాత్కాలిక కదలిక, దాని ఇంజినీరింగ్ డిజైన్‌లో ఒక సాధారణ భాగమని గోయల్ అన్నారు. నీటి ఒత్తిడి పెరిగినప్పుడు స్వల్ప కదలిక సంభవించవచ్చని, ఒత్తిడి తగ్గినప్పుడు నిర్మాణం తిరిగి యథాస్థితికి వస్తుందని తెలిపారు. గత 40 ఏళ్లలో భాక్రా నంగల్ డ్యామ్ గోడలో ఇలాంటి కదలికలు 15 సార్లు నమోదయ్యాయని వివరించారు. అందుకే ఈ విషయంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. భాక్రా నంగల్ ఆనకట్ట సురక్షితంగానే ఉందని చెప్పారు.

**పంజాబ్ సర్కార్‌కు హరియాణా ప్రభుత్వం విజ్ఞప్తి**

ఇటీవలే పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా సర్కార్ కోరింది. లేకపోతే ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని అభిప్రాయపడింది. దిల్లీలో ఆప్ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని పేర్కొంది. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదని వెల్లడించింది. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా పంజాబ్ ప్రభుత్వం వ్యవహరించకూడదని కోరింది. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే రాలేదని స్పష్టం చేసింది. భాక్రా నంగల్ ఆనకట్ట నిర్మాణం 1948వ సంవత్సరంలో మొదలై 1963లో పూర్తైంది. దీని ఎత్తు 741 అడుగులు (226 మీటర్లు). ఈ డ్యామ్ ఇంచుమించు 10 మిలియన్ ఎకరాలకు పంట నీరును అందిస్తుంది. ఈ డ్యామ్‌ను ఉత్తర భారతదేశంలోని పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ సరిహద్దులలో నిర్మించారు. ఈ డ్యామ్ నిర్మాణానికి ముఖ్య కారణం సట్లెజ్-బియాస్ నదీ పరీవాహక ప్రాంతంలో వరదలను నిరోధించడం, పంట పొలాలకు సాగునీటి పంపిణీ, జల విద్యుత్తు (హైడ్రో విద్యుత్) ను ఉత్పత్తి చేయడం. ప్రస్తుతం భాక్రా నంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ నీటి అవసరాలను తీరుస్తోంది.

# మీ పేర్లు మేం చదవలేం

-మొదటిపేజీ తరువాయి

పోలింగ్ కేంద్రాల పరిధిలో సభలను నిర్వహించారు. ఈ సమావేశాల్లో కొన్ని ప్రాంతాల్లో 6, 7, 8 ఫారాలను అసలు తీసుకురాలేదు. కొన్ని ప్రాంతాల్లో ఓటరు నమోదు, సవరణ పత్రాలనూ పంపిణీ చేసినప్పటికీ వాటి గురించి వివరించలేదు. నిరక్షరాస్యులు, ఓటరు జాబితాలో పేరు చూసుకోవడం తెలియని వారిని ఉద్దేశించి కేంద్ర ఎన్నికల సంఘం వార్డు సభల నిర్వహణకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. అయితే సమావేశంలో పాల్గొన్న అధికారులు ఓటర్లతో మీ పేర్లు మేము చదవలేం, జాబితాలో మీ పేరును మీరే చూసుకోండని సమాధానమిచ్చారు. ఈ సమస్యకు అసలు కారణం 20 పోలింగ్? కేంద్రాలకు ఒకేచోట సమావేశం నిర్వహించటమేనని అంటున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల వలస కార్మికుల ఓట్లను ఏఎస్?డీడీ జాబితా కింద తొలగించారు. వాటికి సంబంధించిన వివరాలను ఈ సమావేశంలో వెల్లడించారు. ఇక గ్రేటర్? హైదరాబాద్?లోని జూబ్లీహిల్స్? నియోజకవర్గంలో ఓ వార్డు సభలో సమస్యలు ఎదురయ్యాయి. సుమారు 80 మంది ఓటర్లకు అన్?-మ్యాపింగ్? కింద నోటీసులు వచ్చాయి. 'మేము ఎస్?ఐఆర్?-2002 వివరాలనే అందులో నమోదు చేశాం. యాప్?లో సరిగా అప్?లోడ్? చేయకపోవడం వల్లే మాకు నోటీసులు అందాయి' అని బాధితులు మొర పెట్టుకుంటున్నారు.

**పాతబస్తీలో మరీ దారుణం**

గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు జిల్లాల్లో 10 వేల కేంద్రాలు ఉన్నాయి. కానీ 500 ప్రాంతాల్లోనే సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాలు కూడా రెండు, మూడు గంటలు మాత్రమే కొనసాగాయి. ఓటర్లకు ఫారాలు సరిగ్గా పంపిణీ చేయకుండా శుక్ర, శనివారాల నుంచి నోటీసులపై విచారణ ప్రారంభిస్తుండటం అధికారుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది. హైదరాబాద్?లోని పాత బస్తీలో మాత్రం మరీ దారుణ పరిస్థితి ఏర్పడింది. అక్కడ నోటీసుల పంపిణీ



మూడంకెలకు మించలేదు.

ఈఆర్వోకు చూపించాల్సిన 12 ధ్రువపత్రాలు ఇవే : ఒకవేళ మీకు సర్? నోటీసులు వచ్చినట్లయితే ధ్రువీకరణ కోసం కింది 12 పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని చూపించాలి.

1) 01-07-1987 ముందు ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, ఎల్ఐసీ, స్థానిక సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలు
2) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూ ఉద్యోగులు లేదా పెన్షనర్లకు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు(పీపీవో)
3) విదేశాంగ శాఖ జారీ చేసిన పాస్‌పోర్టు
4) ప్రభుత్వం నిర్దేశించిన అధికారితో జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్
5) అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం
6) క్యాస్ట్ సర్టిఫికెట్
7) గుర్తింపు పొందిన బోర్డులు, విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్ (ఎస్?ఎస్?సీ) లేదా ఇతర విద్యార్హత పత్రాలు
8) సంబంధిత అధికారి జారీ చేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం
9) రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు జారీ చేసిన కుటుంబ రిజిస్టర్ పత్రం
10) ఆధార్ కార్డు (కమిషన్ నిర్దేశించిన నిబంధనలు వర్తిస్తాయి)
11) ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా భూమి, ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రం
12) జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్సీ) (ఎక్కడైనా అమలులో ఉంటే)

# కమలం పార్టీకి పొలిటికల్ స్పేస్

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అంతర్గత విభేదాలు, పరిపాలనాపరమైన ఇబ్బందులతో ప్రజల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. ఇటు బిఆర్ఎస్ ప్రాభవం కోల్పోతుండటం, అటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుండటంతో.. కమలం పార్టీకి స్పష్టమైన పొలిటికల్ స్పేస్ లభించింది. కానీ, ఈ సువర్ణ అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ తీవ్రంగా తడబడుతోంది .మీరు కేసీఆర్ పదేళ్ల పాలన చూశారు, కాంగ్రెస్ మార్పు పాలననూ చూస్తున్నారు.. ఒక్కసారి కమలానికి అవకాశం ఇవ్వండి అనే బలమైన నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటినప్పటికీ, ఆ ఉత్సాహాన్ని రాష్ట్ర స్థాయి అధికారం దిశగా మళ్లించే సమిష్టి వ్యూహం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కేవలం ఢిల్లీ పెద్దల ఇమేజ్, మోదీ చరిష్మాపైనే ఆధారపడటం తప్ప.. స్థానిక నాయకత్వం ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని నింపలేకపోతోంది. కేవలం ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపడం మాత్రమే సరిపోదు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే ప్రణాళికను దాన్ని నడిపించే ఒక ఫేస్ ను చూపిస్తేనే ప్రజలు జాతీయ పార్టీలకు ప్రాంతీయ స్థాయిలో ఓటేస్తారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ బీజేపీకి ఉన్న ప్రధాన లోపం.. స్పష్టమైన సీఎం ఫేస్ లేదా తిరుగులేని ఒకరిద్దరు బలమైన నాయకులు లేకపోవడం . గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అగ్రెసివ్ హిందుత్వ, నిరసనలతో కేడర్‌లో పీక్ లెవెల్ జోష్ ఉండేది. ఆ తర్వాత జి. కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్రనేతలు ఉన్నప్పటికీ.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా గ్రూపు రాజకీయాలు



సాగుతున్నాయనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల అధికార కాంగ్రెస్‌పై లేదా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఒక్కటిగా దాడి చేయలేకపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని దీదీ కోటను బద్దలు కొట్టడానికి బీజేపీ ఎలాగైతే అగ్రెసివ్ కేడర్ పాలిటిక్స్ చేసిందో, తెలంగాణలోనూ అలాంటి బెంగాల్ తరహా పోరాట వ్యూహం అవసరమనేది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. అక్కడ కమలం పార్టీ ప్రతీ పంచాయతీ, ప్రతీ వార్డు స్థాయి వరకు వెళ్లి కేడర్‌ను నిర్మించి, అధికార పార్టీ దాష్టీకాలను ధైర్యంగా ఎదుర్కొంది. కానీ తెలంగాణలో ప్రెస్ మీట్లు, కరపత్రాల పంపిణీ, ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతున్నారు తప్ప.. ప్రజల తరఫున సుదీర్ఘకాలం పాటు రోడ్డెక్కి పోరాడే పాదయాత్రలు, ధర్నాలు కరువయ్యాయి. బీజేపీ పై సామాన్య ప్రజల్లో ఉన్న మరో అనుమానం.. బీఆర్ఎస్ – బీజేపీ ఒకటేనా? అనే పాత ప్రచారం. ఈ నెగెటివ్ ఇంప్రెషన్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టేలా బీజేపీ గ్రౌండ్ లెవెల్‌లో నమ్మకాన్ని కలిగించలేకపోయింది. తెలంగాణలో బీజేపీకి అధికారం దక్కాలంటే తక్షణమే కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరం. పార్టీలోని గ్రూపు తత్వాలకు స్వస్తి చెప్పి, ఒక సమర్థవంతమైన, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని ముందు పెట్టి నడిపించాలి. ప్రజల నిత్య జీవిత సమస్యలైన రుణమాఫీ, ఉపాధి, రైతు భరోసా, మౌలిక వసతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్లీ కోలుకోవడం తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చు=

# బీజేపీవైపు మూడ్ ఆఫ్ ది నేషన్...

**హైదరాబాద్ :** వాస్తవానికి ఇప్పట్లో కేంద్రస్థాయిలో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఎందుకంటే సంకీర్ణ ప్రభుత్వం అయినప్పటికీ.. భాగస్వామ్య పార్టీలతో ఎటువంటి లుకలుకలు లేకుండా చూసుకుంటున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. టిడిపి తో.. అటు నితీష్ కుమార్ పార్టీతో.. ఏకకాలంలో ఉభయ కుశలోపరి అనే పాత్రను నరేంద్ర మోడీ పోషిస్తున్నారు. ఇటీవల కాలంలో నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ పురుడు పోసుకుంది. ఏకంగా జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇవి కాస్త సంచలనంగా మారాయి. ఒకరకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. అంతేకాదు జెన్ జెడ్ ను సంతృప్తి పరచడానికి నరేంద్ర మోడీ ఏకంగా ఇన్ స్టా గ్రామ్ లో వీడియోలు చేయాల్సి వస్తోంది. ఈ పరిణామాలు కేంద్రంలో బిజెపి స్థాయిని తగ్గిస్తున్నాయా.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందా. కాక్రోచ్ జనతా పార్టీ సంచలనం సృష్టిస్తుందా.. ఇలా అనేక అంశాల ఆధారంగా మూడ్ ఆఫ్ దినేషన్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఆసక్తికరమైన ఫలితాలు వెల్లడయ్యాయి. ఇప్పటికిప్పుడు దేశవ్యాప్తంగా ఎన్నికల జరిగితే బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. ఎన్డీఏ కూటమి



ఏకంగా 326 సీట్లతో అధికారంలోకి వస్తుందని తెలుస్తోంది. మరోవైపు ఇండియా కూటమికి 185 సీట్లు లభిస్తాయని సమాచారం. ధరల స్థాయి పెరగడం.. నిరుద్యోగం.. ఇంకా అనేక సమస్యలు దేశంలో ఉన్నాయి. అయినప్పటికీ జెన్ జెడ్.. మిగతా వర్గాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నాయి. ఆయన ఆధ్వర్యంలోనే దేశం బలోపేతం అవుతుందని భావిస్తున్నాయి. ఈ సర్వేలో అనేక ప్రశ్నలను సంధించారు. ప్రధానంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి 67 శాతం మంది అసంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యవస్థ మీద నమ్మకం లేదని కుండబద్దలు కొట్టారు. మిగతా 14 శాతం మంది పరీక్షలు నిష్పక్షపాతంగా జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని 17 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఎన్నికలలో రిగ్గింగ్.. అవినీతిని అరికట్టే విషయంలో కేంద్రం విఫలమవుతుందని మెజారిటీ యువత అభిప్రాయపడ్డారు. గతంలో ఈ సంఖ్య కొంత మాత్రమే ఉండగా.. ఇప్పుడు చాలామంది యువత జవాబుదారితనాన్ని కోరుకుంటుండడం విశేషం. మరోవైపు ఇటీవల నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం మీద ఆందోళనలు నిర్వహించిన కాక్రోచ్ జనతా పార్టీకి ఓటు వేస్తారని ప్రశ్నిస్తే.. చాలామంది వేయబోమని చెప్పారు. అది కేవలం ప్రశ్నించే గొంతు లాగా మాత్రమే ఉండాలని స్పష్టం చేశా

## రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించండి

-మొదటిపేజీ తరువాయి

ఈనెల 26న జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో ప్రభుత్వం తమ అభ్యంతరాలను వివరించింది. ఈఎన్సీ జనరల్ రమేశ్‌బాబు 2027 ఆగస్టు వరకు తాగునీటి అవసరాల కోసం 112 టీఎంసీల నీటిని కేటాయించాలని బోర్డును కోరారు. ఈ మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో అవసరమైన నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ కోరింది. అలాగే తాగునీటి అవసరాల కోసం తమకు 47 టీఎంసీలు కేటాయించలన్న ఏపీ ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. తదుపరి సెప్టెంబర్ నాలుగున జరిగే తదుపరి సమావేశంలోనూ తెలంగాణ ప్రభుత్వ ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ఎల్?నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాపాతం లోటును దృష్టిలో ఉంచుకొని తాగునీటి విషయంలో రాజీ పడకుండా ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

**ప్రజ్ఞానందకు అభినందనలు తెలిపిన సీఎం**

అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని.. చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని సీఎం పేర్కొన్నారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీ యువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు.

## లక్కీ డ్రాతోనే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి

తాకట్టు పెట్టుకునేందుకు సైతం అనుమతి ఉంటుందని చెప్పారు. పారదర్శకంగా లక్కీ డ్రాతోనే ఇళ్లను కేటాయిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**4 నియోజకవర్గాల్లో ఎంపిక**

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా మొదటి విడతలో 7,380 ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఇల్లు నిర్మించి ఇస్తున్నామని అన్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇల్లు విలువ రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు ఉంటుందని చెప్పారు. నాంపల్లి, రాజేంద్రనగర్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

**4 రోజుల పాటు లక్కీ డ్రా**

మొదటి దఫాలో 7,340 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అర్హులకు అందించనుంది. ఆయా నియోజకవర్గాల్లో 4 రోజుల పాటు లక్కీ డ్రా నిర్వహణ ఉండనుంది. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 60 వేల దరఖాస్తులు వచ్చాయి. 19 వేల ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఇళ్లు దక్కని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు.

"క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకామనీ) ప్రాంతంలో లక్ష ఇళ్లను మంజూరు చేశాం. ప్రతి నియోజకవర్గంలో మొదటి విడతలో భాగంగా సుమారు 500ల చొప్పున ఇళ్లు వస్తున్నాయి. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు కూడా ఫైనల్? చేశాం. ఎవరైతే లాటరీలో ఈరోజు ఇళ్లు పొందుతున్న ఆడబిడ్డలున్నారో వారికి సంవత్సరంలోపే ఇంటిని అద్భుతంగా కట్టి ఆ ఇళ్లను ఆ ఆడబిడ్డ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తాం. రిజిస్ట్రేషన్?కు కూడా ఎలాంటి ఛార్జీలు ఉండవు. పదేళ్ల తర్వాత వారు ఆ ఇంటిని అమ్ముకునేందుకు వెసులుబాటు ఉంటుంది. మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాలను గుర్తించాం. టెండర్ల ప్రక్రియ చేపట్టబోతున్నాం. అక్కడ కూడా వారికి ఇళ్లను నిర్మించి ఇస్తాం"

**లాటరీ తీసిన బాలుడి కుటుంబానికే ఇల్లు**

ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధికి సంబంధించి ఓ బాలుడితో మంత్రి పొంగులేటి టోకెన్? తీయించారు. అయితే అందులో ఆ బాలుడి తల్లి పేరే (జరపుల లక్ష్మీ) వచ్చింది. ఈ సన్నివేశం అందరినీ ఆనందానికి గురిచేసింది. ఇలాంటి సందర్భాలు చాల అరుదుగా జరుగుతుంటాయి. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానమని, స్వచ్ఛమైన మనసున్నవారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్వీట్ చేశారు. దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బ్రతకాలని ఆ ఆడబిడ్డను మనసారా ఆశీర్వదించానంటూ సోషల్? మీడియాలో పోస్ట్? చేశారు.

## రేవంత్ రెడ్డికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది



-మొదటిపేజీ తరువాయి

పండుగ వాతావరణంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయను. నేను అందరికీ సోదరినే. సీఎం రేవంత్ రెడ్డికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రేవంత్ రెడ్డికి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఇవ్వాలని, ఆడబిడ్డల ఆశీర్వాదాలు రేవంత్ రెడ్డికి ఎప్పుడూ ఉండాలని దేవుడిని కోరుకున్నా' అని తెలిపారు.

"రాఖీ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను. సీఎం రేవంత్ రెడ్డికి ఆడపడుచులందరి దీవెనలు ఉంటాయి. వారు సుపరిపాలన అందించాలని, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు వారికి శక్తియుక్తులు భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. సీఎం రేవంత్ ఆశీస్సులు ఆడపడుచులందరిపై ఉండాలని కోరుతున్నా"

**పరకాల వివాదం తర్వాత తొలిసారి**

పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీస్ ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సురేఖ సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు ప్రతి ఏడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టడం సంతోషంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి మంత్రులతో పాటు మహిళా కమిషన్ ఛైర్?పర్సన్ గద్వాల విజయలక్ష్మి, సభ్యులు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, బ్రహ్మకుమారీస్, కాంగ్రెస్ మహిళా నాయకులు, మలక్?పేటలోని గవర్నమెంట్ హైస్కూల్ ఫర్ ది బ్లైండ్ గర్ల్స్ విద్యార్థినిలు రాఖీ కట్టారు. "రాష్ట్రంలో, దేశ విదేశాల్లో ఉన్న అక్కాచెల్లెళ్లందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. గత 12 సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతి ఏటా రాఖీ కడుతున్నాను. ఓ ఆదివాసి బిడ్డగా ఉన్న నన్ను మంత్రిగా ఈ స్థాయికి తీసుకురావడంలో ఆయన కృషి, మద్దతు ఎంతో ఉంది. ప్రతి సంవత్సరం మొదటగా ములుగు నియోజకవర్గంలో రాఖీ పౌర్ణమి జరుపుకొంటాం. సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. అక్కా అని అభిమానంతో వచ్చే ప్రతి ఒక్కరికి రాఖీ కడుతూ ఉంటాను. ప్రజా సేవకే ఈ జీవితం అంకితం చేస్తూ మరింత ముందుకు వెళ్తామని తెలియజేస్తున్నా"– సీతక్క, మంత్రి

# సంపాదకీయం

## చేసిన పాపాలే.. శాపాలై..

నేపాల్‌లో సంభవించిన ఘోరమైన వరదలు, భోటేకోషి , త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాల్లో సృష్టించిన బీభత్సం వెనుక చైనా కక్కుర్తి ఉందన్న విమర్శలు వస్తున్నాయి. భూభాగ సరిహద్దుల వివాదాలు మరి, కట్టడాల వల్లనే ఈ వరదలన్న అభిప్రాయం వినిపిస్తోంది. చైనా టిబెట్ సరిహద్దు వద్ద నిర్మిస్తున్న మౌలిక వసతులు, డ్యామ్‌లు , నియంత్రణ లేని నిర్మాణ కార్యకలాపాల వల్ల ప్రవాహాలు మళ్లి నేపాల్ వైపు ముంచెత్తుతున్నాయని, అందుకే ఈ విపత్తుకు చైనా విధానాలే పరోక్ష కారణమనే ప్రచారం ఊపందుకుంది.ఈ విపత్తుకు కేవలం మానవ తప్పిదాలే కాకుండా హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ మార్పులు ప్రధాన కారణమని తేలింది. అంతర్జాతీయ సమగ్ర పర్వత అభివృద్ధి కేంద్రం అధ్యయనాల ప్రకారం టిబెట్-నేపాల్ సరిహద్దులోని లెండే ఖోలా ప్రాంతంలో భారీ మంచు , రాళ్ల కొండచరిలు విరిగిపడటమే ఈ హఠాత్ వరదలకు ముఖ్య చోదక శక్తిగా మారింది.మరోవైపు అంతర్జాతీయ పర్యావరణ వేత్తలు చైనాపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిబెట్ పీఠభూమిపై విస్తృతంగా జరుగుతున్న ఆనకట్టల నిర్మాణం, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుల విస్తరణ , ఎగువ భాగాల్లో సమాచార వ్యవస్థలను నేపాల్ వంటి దిగువ దేశాలతో సరిగ్గా పంచుకోకపోవడం చైనా పెద్ద తప్పిదమని విమర్శిస్తున్నారు. నదీ ప్రవాహ డేటాను దాచిపెట్టడం వల్ల నేపాల్ ప్రజలు సకాలంలో అప్రమత్తం కాలేకపోతున్నారని అంతర్జాతీయ మీడియా ఎండగట్టింది.ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు? పర్యావరణ పరిరక్షణను పక్కనపెట్టి చైనా హిమాలయాల్లో సరిహద్దు వెంట చేపడుతున్న మౌలిక ప్రాజెక్టులే పదేపదే ఇలాంటి ప్రమాదాల తీవ్రతను పెంచుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాద నివారణకు చైనా సరిహద్దు దేశాలతో పారదర్శకమైన వాతావరణ సమాచారాన్ని పంచుకోవాలని, ఆనకట్టల నిర్మాణ భద్రతపై జవాబుదారీతనంతో వ్యవహరించాలని అంతర్జాతీయ సమాజం డిమాండ్ చేస్తోంది.సుమారు 2,000 అడుగుల వెడల్పు ఉన్న ఆ హిమానీనదంలోని ఒక భాగం అకస్మాత్తుగా విరిగి, 4,000 అడుగుల లోతున ఉన్న లోయలోకి పడింది. అది 5.2 తీవ్రతతో భూకంపం లాంటి ప్రకంపనలను సృష్టించేంత శక్తివంతమైంది. ఆ ప్రకంపనలు ఎంత బలంగా ఉన్నాయంటే, యుఎస్ జియోలాజికల్ సర్వే మొదట దానిని భూకంపంగా పొరపాటుపడింది. తర్వాత భూకంపం కాదని నిర్ధారించుకున్నారు. ఆ హిమానీనదం కూలిపోవడమే భూకంప తరంగాలను సృష్టించింది. ఆ తర్వాత జరిగిన విధ్వంసం మాటలకు అందనిది...ఇదంతా లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతాల ఉత్తరపు వాలు ప్రాంతాల్లో మొదలైంది. గూగుల్ ఎర్త్, ప్లానెట్ ల్యాబ్స్, నేపాల్ నేచురల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ వారి ఉపగ్రహ చిత్రాల ప్రకారం, ఆ ప్రాంతం ఒక భారీ హిమానీనదంతో కప్పి ఉంది. సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్న ఈ హిమానీనదం దిగువ భాగం అకస్మాత్తుగా విడిపోయి, కింద ఉన్న లోయలోకి 4,000 అడుగుల లోతు నుంచి పడిపోయింది.దీని వల్ల విడుదలైన శక్తి హిరోషిమా అణు విస్ఫోటనం శక్తిలో సుమారు 6.3 శాతంగా అంచనా వేశారు. ఇది ఎంత శక్తివంతమైనదంటే, మొదట దీనిని 4.4 తీవ్రత గల భూకంపంగా భావించింది. ఆ తర్వాత, మరింత లోతుగా దర్యాప్తు చేస్తే ఇది భూకంపం కాదని, ఒక హిమానీనదం కూలిపోవడం వల్ల కలిగిన 5.2 తీవ్రత గల ప్రకంపన అని వెల్లడైంది. అంటే, మంచు పొర కూలిపోవడంతో వల్ల భూకంపం వంటి ప్రకంపనలను సృష్టించిందిఈ భారీ మంచు కొండ లోయలోకి కూలినప్పుడు, అది భోటే కోషి నదికి ఉపనది అయిన లెండే ఖోలా నదిని పూర్తిగా అడ్డుకుంది. దీనివల్ల ఒక సహజ ఆనకట్ట ఏర్పడి, దాని వెనుక భారీగా వరద నీరు పేరుకుపోయింది. ఈ మంచు ఆనకట్ట ఎక్కువ సేపు ఉండలేదు. కరిగిపోయింది. నదీ జలాలు, బురద, రాళ్లతో కలిసి ఒక భయంకరమైన పరిస్థితిని సృష్టించింది. ఆనకట్ట తెగినప్పుడు, బయటకు ప్రవహించింది కేవలం నీరు మాత్రమే కాదు. అది బురద, రాళ్ళు, మంచు, శిథిలాలతో కూడిన ఒక భయంకరమైన తుపాను పరిస్థితిని క్రియేట్ చేసింది. నిపుణులు దానిని "లిక్విడ్ కాంక్రీటు"గా వర్ణించారు. అది ఎంత శక్తివంతంగా ఉందంటే, దానిని ఆపడం అసాధ్యమైంది. 100 అడుగుల ఎత్తైన ఈ సునామీ లాంటి అల, లెండే ఖోలా, భోటే కోషి, ఆ తర్వాత త్రిశూలి నది గుండా వేగంగా దూసుకెళ్లింది.వరద అన్నింటినీ ఊడ్చేసింది. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడాతో సహా రెండు డజన్ల దేశాలకు చెందిన 579 మంది పర్యాటకులతో కలిపి సుమారు 826 మంది గల్లంతయ్యారు. టిబెట్‌లోని గిరాంగ్ కౌంటీలో 558 మంది గల్లంతయ్యారని చైనా మీడియా నివేదించింది. కొన్ని నివేదికల ప్రకారం గల్లంతైన వారి సంఖ్య 1,000కి పైగా ఉంది.లాంగ్‌టాంగ్ ట్రెకింగ్ మార్గానికి స్టార్టింగ్ పాయింట్ అయిన స్యాబ్రుబేసి ధ్వంసమైంది. కైలాష్ మానస సరోవర యాత్ర మార్గాలు కూడా మూతపడ్డాయి. నేపాల్‌లోని రసువా జిల్లాలో దాదాపు 13 జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితం కాగా, తొమ్మిది బ్యాంకు శాఖలు కొట్టుకుపోయాయి. 26 మంది ఉద్యోగులు ఇప్పటికీ గల్లంతయ్యారు.ఇది కేవలం ఒక ప్రమాదం కాదు. ఒక పెద్ద మార్పుకు సంకేతం. హిమాలయాల్లోని హిందూ కుష్ ప్రాంతం ప్రపంచ సగటు కంటే వేగంగా వేడెక్కుతోంది. 2023 నాటి ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, గత 30 ఏళ్లలో నేపాల్‌లోని మంచుతో కప్పి ఉన్న శిఖరాలు తమ మంచులో దాదాపు మూడింట ఒక వంతును కోల్పోయాయి. గత దశాబ్దంతో పోలిస్తే, ఈ దశాబ్దంలో హిమానీనదాల కరిగిపోవడం 65 శాతం వేగవంతమైంది.ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్ ప్రకారం, హిందూ కుష్-హిమాలయ ప్రాంతమంతటా వరదలు, కొండచరియలు విరిగిపడటం, హిమపాతాలు పెరుగుతున్నాయి. ఒక్క నేపాల్‌లోనే 47 హిమానీనద సరస్సులు ఉన్నాయి, అవి ఏ క్షణంలోనైనా విస్ఫోటనం చెందగలవు, అందుకే వాటిని "టైమ్ బాంబులు" అని పిలుస్తున్నారు.హిమాలయాల భూగర్భ నిర్మాణం ఇప్పటికే అస్థిరంగా ఉందని నిపుణులు అంటున్నారు. భారత, యూరేషియన్ ఫలకాలు ఇప్పటికీ ఢీకొంటూ ఉండటం వల్ల, హిమాలయాలు సంవత్సరానికి 40-50 మిల్లీమీటర్ల మేర పైకి లేస్తున్నాయి. ఈ అస్థిరమైన భూభాగానికి గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు కూడా తోడైనప్పుడు, ఇలాంటి ఘటనలు మరింత తరచుగా జరుగుతాయి.ఈ విషాదం 2015లో లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతం దక్షిణ వాలు నుంచి కొండచరియ విరిగిపడి దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయిన 7.8 తీవ్రత గల భూకంపంను గుర్తుచేస్తోంది. ఇప్పుడు, అదే పర్వతం మరోసారి వినాశనానికి కారణమైంది.వరద నీరు ఎంత బలంగా, భారీగా ఉందంటే, శిథిలాలు దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణి నదిని చేరుకున్నాయి. నేపాల్ ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థసహాయక, రెస్క్యూ కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. ప్రశ్న ఏమిటంటే: భవిష్యత్తులో రాబోయే ఇలాంటి ఘటనలకు మనం సిద్ధంగా ఉన్నామా? పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కరుగుతున్న హిమానీనదాలు తీవ్రమవుతున్న అస్థిరత హిమాలయాలను ప్రమాదకరమైన ప్రాంతంగా మారుస్తున్నాయి.

## పాతాళ లోకం నుంచి ప్రారంభమైన రక్షాబంధనం

**- ఒక ప్రత్యేకమైన వాగ్దానం కారణంగా కట్టబడిన తొలి రాఖీ**

రక్షాబంధనం ఒక ప్రాచీన భారతీయ పండుగ. ఈ పండుగ ప్రారంభం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. అయితే, ఈ రోజు మేము మీకు చెప్పబోయే కథను ఈ పండుగకు సంబంధించిన అత్యంత పురాతన కథగా భావిస్తారు. అన్నయ్య చేతికి రాఖీ కట్టే సంప్రదాయం కూడా ఈ కథ నుంచే ప్రారంభమైందని చెబుతారు. రక్షాబంధనం పండుగను 2026 ఆగస్టు 28, శుక్రవారం జరుపుకోనున్నారు. ఏదైనా పండుగ సమీపిస్తే, ఆ పండుగకు సంబంధించిన కథలు, పురాణ గాథల గురించి తెలుసుకోవాలని కోరుకోవడం సహజమే. ఈ పండుగకు సంబంధించి ప్రతి ఒక్కరి మనసులో ఉండే ఒక ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే--- అసలు ఈ పండుగ ఎలా ప్రారంభమైంది? చరిత్రలో తొలిసారిగా రాఖీని ఎవరు, ఎవరికి కట్టారు?
ఈ రోజు మన ప్రత్యేక కథనంలో మీ ఈ ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం తెలుసుకుందాం. రాఖీ సంప్రదాయం భూమిపై కాకుండా పాతాళ లోకం నుంచి ప్రారంభమైందని మీకు తెలుసా? పురాణ విశ్వాసాల ప్రకారం, రక్షాబంధనం పండుగను స్వయంగా మాతా లక్ష్మీదేవి ప్రారంభించారు. ఒక ప్రత్యేకమైన వాగ్దానం కారణంగా ఆమె రాజా బలిచక్రవర్తి చేతికి తొలి రాఖీని కట్టారు. రాఖీకి సంబంధించిన అత్యంత పురాతనమైన పురాణ కథను తెలుసుకుందాం.
రక్షాబంధనానికి సంబంధించిన అత్యంత పురాతన కథ శ్రీమద్భాగవత పురాణం ప్రకారం, అసురరాజు బలిచక్రవర్తి ఎంతో పరాక్రమశాలి, దానశీలుడైన రాజు. తన తపోబలం, పరాక్రమంతో ఆయన మూడు లోకాలపై తన ఆధిపత్యాన్ని స్థాపించాడు. దీంతో భయపడిన దేవేంద్రుడు శ్రీమహావిష్ణువును శరణు కోరాడు. అప్పుడు దేవతల రక్షణ కోసం శ్రీమహావిష్ణువు వామన అవతారం ధరించి రాజా బలి నిర్వహిస్తున్న యజ్ఞానికి వెళ్లారు. యజ్ఞానికి వచ్చిన వామనదేవుడిని చూసిన బలిచక్రవర్తి, తనకు కావాల్సిన దానాన్ని కోరుకోమని చెప్పాడు. అందుకు వామనదేవుడు కేవలం మూడు అడుగుల భూమిని దానంగా ఇవ్వమని కోరాడు.



రాజా బలి ఆ మూడు అడుగుల భూమిని ఇవ్వడానికి అంగీకరించగానే, వామనదేవుడు తన విశ్వరూపాన్ని ధరించాడు. రెండు అడుగులతోనే భూమి, ఆకాశం, స్వర్గలోకాలను కొలిచాడు. మూడవ అడుగు పెట్టడానికి స్థలం ఏదీ మిగలలేదు. అప్పుడు రాజా బలి తన తలను వామనదేవుడి పాదాల వద్ద ఉంచాడు. బలిచక్రవర్తి భక్తికి, దానశీలతకు ప్రసన్నమైన శ్రీమహావిష్ణువు ఆయనను పాతాళ లోకానికి రాజుగా నియమించారు. అంతేకాక, ఏదైనా వరం కోరుకోమని బలిని కోరారు. అప్పుడు రాజా బలి ఒక అత్యంత ప్రత్యేకమైన వాగ్దానాన్ని కోరాడు.
"ప్రభూ! నేను ఉదయం నిద్రలేచినప్పుడు గానీ, రాత్రి నిద్రపోయేటప్పుడు గానీ మీరు ఎల్లప్పుడూ నా ఎదుటే ఉండేలా నాకు వరం ప్రసాదించండి. మీరు నా పాతాళ లోకానికి ద్వారపాలకుడిగా ఉండాలని నా కోరిక."
రాజా బలి కోరిన వరాన్ని శ్రీమహావిష్ణువు అంగీకరించారు. ఆ తరువాత శ్రీమహావిష్ణువు వైకుంఠధామాన్ని విడిచిపెట్టి పాతాళ లోకంలో రాజా బలికి ద్వారపాలకుడిగా నివసించసాగారు.
శ్రీమహావిష్ణువును తిరిగి తీసుకురావడానికి మాతా లక్ష్మీ కట్టిన తొలి రాఖీ శ్రీమహావిష్ణువు వైకుంఠధామాన్ని విడిచిపెట్టడంతో మాతా లక్ష్మీదేవి ఎంతో దుఃఖించసాగారు. అప్పుడు తన స్వామిని తిరిగి తీసుకురావడానికి ఒక ప్రణాళిక రచించారు. ఆ ప్రణాళికలో భాగంగా మాతా లక్ష్మీదేవి ఒక సాధారణ స్త్రీ రూపాన్ని ధరించి పాతాళ లోకానికి వెళ్లారు. ఆమె రాజా బలిని తన సోదరుడిగా భావించి, శ్రావణ పౌర్ణమి రోజున రాజా బలి మణికట్టుకు రక్షాసూత్రాన్ని కట్టారు. అలాగే రాజా బలి దీర్ఘాయుష్షుతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.
ఇది చూసిన రాజా బలి హృదయం ప్రేమ, వాత్సల్యంతో నిండిపోయింది. తన ధర్మసోదరి తనను ఏదైనా కోరుకోవాలని ఆయన చెప్పాడు. అప్పుడు మాతా లక్ష్మీదేవి తన నిజ స్వరూపంలో ప్రత్యక్షమై ఇలా అన్నారు:
రాజా! నాకు ధనం, సంపద ఏమీ అవసరం లేదు. నా స్వామిని నాకు తిరిగి అప్పగించండి.
మాతా లక్ష్మీదేవి తన చేతికి కట్టిన పవిత్రమైన రక్షాసూత్రానికి రాజా బలి ఎంతో గౌరవం ఇచ్చాడు. వెంటనే తాను శ్రీమహావిష్ణువును తన ద్వారపాలకుడిగా ఉండమని కోరిన ఆ ప్రత్యేకమైన వాగ్దానం నుంచి ఆయనను విముక్తి చేశాడు. ఆ తరువాత మాతా లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువును వెంటబెట్టుకుని తిరిగి వైకుంఠధామానికి చేరుకున్నారు.
ఈ సంఘటన జరిగిన తరువాతే రాఖీ పండుగ లేదా రక్షాబంధనం పండుగను జరుపుకునే సంప్రదాయం ప్రారంభమైందని పురాణాలు చెబుతున్నాయి.

కొలనుపాక కుమారస్వామి
9963720669, వరంగల్.

## ప్రతి కుటుంబం మొక్కలు నాటి సంరక్షించాలి

**- జెండాగూడలో 2,500 పండ్ల మొక్కల పంపిణీ**

కాసిపేట, ఆగస్టు 28 :(మన మీ వార్త మండల ప్రతినిధి)

మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జెండాగూడలో కోలం గిరిజన కుటుంబాలకు ఉచితంగా 2,500 పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. బెల్లంపల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో, నాబార్డ్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ సహకారంతో పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం, వ్యవసాయ--అటవీ ప్రాజెక్టులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.కడియం నర్సరీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన నాణ్యమైన పండ్ల మొక్కలను కుటుంబాలకు అందజేశారు. మామిడి 500, ఉసిరి 500, పనస 500, జామ 500, బొప్పాయి 500 చొప్పున మొత్తం 2,500 మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం మొక్కలను నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాల పోషకాహారం, భవిష్యత్ ఆదాయానికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మొక్కలను పెంచాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు.







**పోషకాహారం-- ఆదాయానికి దోహదం**

ఎఫ్‌పీసీ ఛైర్మన్ ఎంబడి కిషన్ మాట్లాడుతూ కోలం గిరిజన కుటుంబాల పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ ఆదాయాన్ని పెంపొందించే లక్ష్యంతో పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల 17 రకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలతో కూడిన విత్తన ప్యాకెట్లను కూడా ఉచితంగా అందజేశామని చెప్పారు. రైతులు, గిరిజన కుటుంబాలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజన కుటుంబాల అభివృద్ధికి ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.
అనంతరం గ్రామస్థులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అనిత, అర్చన, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎఫ్‌పీసీ ఛైర్మన్ ఎంబడి కిషన్, సీఎస్ఏ ప్రోగ్రాం కోఆర్డినేటర్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## లండన్ వరకు లుక్కా హిమజ ప్రతిభ..

**- బ్రిటన్ మహారాణి నిర్వహించే రచనా పోటీకి న్యాయనిర్ణేతగా అరుదైన గుర్తింపు**

**- అంతర్జాతీయ రచనా పోటీలో జడ్జిగా తెలంగాణ యువ న్యాయవాది లుక్కా హిమజ... రాయల్ కామన్వెల్త్ సొసైటీ నుంచి 'వాల్యూడ్ జడ్జ్' సర్టిఫికెట్.**

ఆగస్టు 28 :(మన మీ వార్త ప్రతినిధి)

తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా నమోదై, ప్రస్తుతం హైకోర్టు ప్రముఖ మహిళా న్యాయమూర్తి ఆధ్వర్యంలో లీగల్ రీసెర్చర్‌గా సేవలందిస్తున్న లుక్కా హిమజ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన అంతర్జాతీయ రచనా పోటీలలో ఒకటైన ది క్వీన్స్ కామన్వెల్త్ రైటింగ్ కాంపిటీషన్ 2026 కి న్యాయనిర్ణేతగా వ్యవహరించినందుకు రాయల్ కామన్వెల్త్ సొసైటీ ఆమెకు 'వాల్యూడ్ జడ్జ్' సర్టిఫికెట్ అందజేసింది.
1883లో ప్రారంభమైన ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ రచనా పోటీకి ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు ఉంది. పోటీ విజేతల కోసం నిర్వహించే విన్నర్స్ వీక్ కార్యక్రమం లండన్‌లోని రాజభవనంలో క్వీన్ ఆతిథ్యమిచ్చే ప్రత్యేక అవార్డు వేడుకతో ముగుస్తుంది. ఇలాంటి అంతర్జాతీయ స్థాయి పోటీలో న్యాయనిర్ణేతల బృందంలో చోటు దక్కించుకోవడం హిమజకు అరుదైన గౌరవంగా నిలిచింది.
విద్యారంగంలో కూడా హిమజ చిన్నప్పటి నుంచే విశేష ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 10/10 జీపీఏ, ఇంటర్మీడియట్‌లో కళాశాల ప్రథమ స్థానం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ.ఎల్.ఎల్.బి. ఐదేళ్ల కోర్సులో క్యాంపస్ ప్రథమ స్థానం, తెలంగాణ పీజీ లాసెట్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించారు. అనంతరం ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా లో పబ్లిక్ లా అండ్ లీగల్ థియరీలో ఎల్.ఎల్.ఎం. పూర్తి చేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో లీగల్ రీసెర్చర్‌గా సేవలందిస్తున్న హిమజ, భవిష్యత్తులో న్యాయమూర్తిగా సేవలందించాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నారు. ఆమె తల్లిదండ్రులు లుక్కా చంద్రశేఖరరావు, లుక్కా శ్రీరేఖ ఇద్దరూ






న్యాయవాదులు కాగా, సోదరి డాక్టర్ దివిజ జనరల్ మెడిసిన్‌లో ఎం.డి. అభ్యసిస్తున్నారు.

బ్రిటిష్ రాజకుటుంబానికి చెందిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పోటీలో హిమజకు లభించిన ఈ గుర్తింపు తెలంగాణకు, న్యాయవాద సమాజానికి గర్వకారణంగా, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## పేర్లు మారితే ప్రయోజనం మారుతుందా?

ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాల పేర్లు మార్చడం పాలకులకు పరిపాటి. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ఆ రాజకీయ ఆనవాయితీ కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో తనదైన ముద్ర కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ తీసుకొచ్చిన పలు పథకాల పేర్లను మార్చివేసింది. అయితే కేవలం పేరు మార్పుతోనే పాలకులు అనుకున్న లబ్ధి చేకూరుతుందా? లేదా పేరు మార్పుతో పేదల బతుకులకు అదనపు ప్రయోజనం ఏమైనా చేకూరుతుందా? అనేది ఆలోచించాలి.నిఘంటువులు పరిశీలించడం కేసీఆర్ అమలుచేసిన రైతుబంధు, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పల్లె ప్రగతి, హరితహారం వంటి విప్లవాత్మక పథకాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. వీటిలో కొన్ని పథకాలు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం, పలు రాష్ట్రాలు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ తరహా విధానాలను అనుసరిస్తున్నాయి. అయితే, మన రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ హయాం నాటి పథకాల పేర్లను మార్చింది. రైతుబంధు 'రైతు భరోసా'గా, పల్లె ప్రగతి 'స్వచ్ఛదనంపచ్చదనం'గా, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకం 'ఇందిరమ్మ ఇండ్లు'గా, ఆసరా పింఛన్లు 'చేయూత'గా రూపాంతరం చెందాయి.ప్రభుత్వ సేవలు శోధించడం పేర్లు మార్చడం ప్రభుత్వం పరిపాలనా విధానం కావచ్చు.

## రాజీవ్ గృహ కల్ప లో ఘనంగా రాఖీ పండుగ సంబరాలు...





యాప్రాల్ ఆగస్టు 28: (వార్త ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజ్గిరి నియోజకవర్గం, యాప్రాలు డివిజన్ కౌకూర్ లోని రాజీవ్ గృహ కల్ప కాలనీలో రాఖీ పండుగ వేడుకలు అత్యంత ఆనందోత్సాహాల మధ్య, భావోద్వేగభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా కాలనీకి చెందిన అక్కచెల్లెళ్లు, తల్లులు అందరూ కలిసి తమ సోదరుడు తూడిమెళ్ళ మల్లికార్జున్ కు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ... "రాఖీ అనేది కేవలం ఒక దారం కాదు, అది ఒక జన్మ బంధం. రాజీవ్ గృహ కల్ప కాలనీతో నాకు ఉన్న అనుబంధం ఇప్పటిది కాదు ఎన్నో సంవత్సరాలది. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ నా కుటుంబ సభ్యులే కష్టంలో, సుఖంలో గత ఎన్నో ఏళ్లుగా మీరంతా నాకు అండగా నిలిచారు. ఈ రాఖీతో మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని, ప్రేమను నేను ఎప్పటికీ మరువను, మీ రక్షణ బాధ్యత మీ కాలనీ అభివృద్ధి బాధ్యత నాది. మీ సోదరుడిగా, మీ బిడ్డగా ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని మాటిస్తూ తెలిపాడు. అక్కచెల్లెళ్లు మాట్లాడుతూ, మల్లికార్జున్ అన్న మాకు కేవలం నాయకుడు కాదు, మా ఇంటి సభ్యుడు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అన్నలా ఆదుకుంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన సీఐ రమేష్‌కు ఘన స్వాగతం

- కొత్తకోట నూతన సీఐగా రమేష్...శాలువాతో సత్కరించిన పెబ్బేరు మాజీ ప్రజాప్రతినిధులు
- ప్రజలకు అందుబాటులో ఉండాలి...నూతన సీఐ రమేష్‌కు మాజీ ప్రజాప్రతినిధుల ఆకాంక్ష

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు 28 మీ వార్త




కొత్తకోట: నూతనంగా కొత్తకోట సీఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఓ.డి. రమేష్‌ను పెబ్బేరు మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రమేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ రమేష్‌కు పెబ్బేరు మండలంలోని శాంతిభద్రతలు, ప్రజా సమస్యలు, పోలీసు శాఖకు సంబంధించిన అంశాలపై మాజీ ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించాలని వారు కోరారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన రమేష్ ఆధ్వర్యంలో కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు మరింత పటిష్టంగా ఉంటాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మేకల రవికుమార్ యాదవ్, మాజీ సర్పంచ్, విక్రమ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ, రంగదాసు, మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొని నూతన సీఐ రమేష్‌కు శు భాకాంక్షలు తెలిపారు.

## కొత్త సామాజిక భద్రత పింఛన్ల పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




మన మీ వార్త ఆగస్టు 28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత పింఛన్లు అందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో చేయూత సామాజిక భద్రత పింఛన్లకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. కొత్తగా పింఛన్లు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆమె సూచించారు. చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం ఆగస్టు 31, 2026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన వారు గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 2.25 లక్షల మంది అర్హులకు సామాజిక భద్రత పింఛన్లు అందించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో డియార్వో విజయలక్ష్మి , డిఆర్డిఒ నాగపద్మజా,అడిషనల్ పిడి శ్రీనివాస్,ఎజూఎ పెన్షన్ రేవతి తదితరులు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు..

## ఇంటి తాళం పగులగొట్టి బంగారం చోరీ

కాసిపేట, ఆగస్టు 28 : (మనమీ వార్త మండల ప్రతినిధి)

కాసిపేట మండలంలోని పాత వరిపేట గ్రామంలో ఇంటి తాళం పగులగొట్టి గుర్తుతెలియని దొంగలు బంగారం చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంజీరాల రాజు (51) తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల వివాహానికి ఈ నెల 26న ఉదయం జైపూర్ మండలం ఇందారం గ్రామానికి వెళ్లారు.ఈ నెల 28న అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బెడ్‌రూమ్‌లోని బీరువాను కూడా పగులగొట్టి అందులో ఉన్న సుమారు 7.5 గ్రాముల ముద్ద బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాసిపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

# వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- దోమల నివారణకు 11వ వార్డులో 'డ్రై డే--ఫ్రైడే
- నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పరిశుభ్రతపై ఇంటింటా అవగాహన పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, కౌన్సిలర్

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు 28 మీ వార్త





పెబ్బేరు : పెబ్బేరు మున్సిపాలిటీ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో శుక్రవారం 'డ్రై డే--ఫ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్, స్థానిక కౌన్సిలర్ పర్వీన్ షకీల్ పాల్గొన్నారు. వార్డులోని వీధుల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని పారబోసి, కూలర్లు, పాత టైర్లు, తొట్టెలు, డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటిస్తూ ఇళ్లలో నీరు నిల్వ ఉండే పాత్రలను శుభ్రం చేసి ఎండబెట్టాలని ప్రజలను కోరారు.కమిషనర్ గణేష్ మాట్లాడుతూ... దోమల ఉత్పత్తిని అరికట్టడంలో మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు.

కౌన్సిలర్ పర్వీన్ షకీల్ మాట్లాడుతూ...

వార్డు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించి తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, వార్డు నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు...

# రాఖీ బంధంతో దేశ రక్షణకు పునరంకితం కావాలి: పోతగాని గోపాల్ గౌడ్

----పోతగాని గోపాల్ గౌడ్‌కు రాఖీలు కట్టిన ఉప్పల్ నియోజకవర్గ మహిళా నేతలు

నాచారం, ఆగస్టు 28 ( మన మీ వార్త):





రాఖీ పౌర్ణమి సందర్భంగా నాచారంలోని మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ నివాసంలో శుక్రవారం రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు రాఖీలు కట్టేందుకు కుటుంబ సభ్యులు, సోదరీమణులతో పాటు ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ మహిళా నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా నాయకురాళ్లు గోపాల్ గౌడ్‌కు రాఖీలు కట్టి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ రాఖీ పండుగ విశిష్టతను గుర్తుచేసుకున్నారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోతగాని గోపాల్ గౌడ్ మాట్లాడుతూ రాఖీ పండుగ కేవలం సోదర--సోదరీమణుల మధ్య అనుబంధానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేసే పర్వదినమని అన్నారు. "నేను మీకు రక్ష.. మీరు నాకు రక్ష.. మనందరం దేశానికి రక్ష" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన సూచించారు. దేశ సమగ్రత, ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాఖీ బంధం ద్వారా సోదరభావం, పరస్పర విశ్వాసం మరింత బలపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకురాళ్లు మంజుల వాణి, సబితా యాదవ్, జ్యోతి, విజేత, మమత, లావణ్య, అనితతో పాటు పలువురు మహిళా నాయకులు, సోదరీమణులు పాల్గొని రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత మూడు రోజులుగా జరుపబడుతున్న పవిత్రోత్సవాలు నేటితో ముగిశాయి.

మన మీ వార్త ఆగస్టు 28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ఈ రోజు పవిత్రోత్సవక్రతు మహాపూర్ణాహుతి జరుపబడిన అనంతరం అమ్మవారికి పవిత్ర ధారణం జరిపి భక్తులను దర్శనానికి అనుమతించారు. వందలాది మంది భక్తులు పవిత్రలు అలంకరింపబడిన అమ్మవారిని దర్శించి తన్మయత్వంతో పులకించిపోయారు. భద్రకాళీ శరణం మమ అనే నామస్మరణతో దేవస్థానం మారుమ్రోగింది. సంవత్సరం మొత్తంలో అమ్మవారికి జరుపవలసిన పూజారాధనలలో అర్చకులవల్లగానీ, భక్తుల వల్లగానీ, అధికారుల వల్లగాని సంభవించిన లోటుపాట్లు తెలిసీతెలియక జరిగిన అపచారములవల్ల సంక్రమించిన పాపము తొలగిపోయి శుద్ధిసంపాదనంతో పాటు అమ్మవారికి జరుపబడిన సంవత్సర ఆరాధనా సంపూర్ణ ఫలప్రాప్తి జరిగి లోకకళ్యాణం కోసం ఈ పవిత్రోత్సవాలను దేవాలయాలలో జరుపుతారు. దేశం మొత్తంలో శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయం వైదికాగమ శాస్త్రానుసారం జరుపబడే పూజావిధానానికి అథారిటీగా ప్రజలు చెప్పుకుంటారు. ఇక్కడ జరిగే ఏ క్రతువైనా, ఉత్సవమైనా, ఆరాధనకైనా శాస్త్రాధారం తప్పకుండా ఉండితీరుతుంది. కాబట్టి వైదిక ఆగమ అనుయాయులు



భద్రకాళీ గుడి సంప్రదాయాన్నే ఆచరణలో పెట్టుకుంటారు.

ఈ రోజు శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన కార్యక్రమాన్ని వేలాదిమంది భక్తులకు పురోహితులు రక్షాబంధాన్ని జరిపారు. శ్రావణ పౌర్ణమి రోజున పురోహితుడు ప్రజలకు రక్షాబంధనాన్ని జరపాలని భవష్య పురాణంలో ఉన్నట్లు ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఇంట్లో ఆడపచులతో ఆచారం ప్రకారం జరుపుకున్ననూ శాస్త్ర పద్ధతిని అనుసరించి మంత్రోచ్చారణతో పురోహితుడి చేత రక్షాబంధనం జరుపుకోవడం భక్తులు అదృష్టంగా భావించారు.



ఈరోజు శుక్రవారం కూడా కావడంతో ఉదయం నుండే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

రామల సునీత
కార్యనిర్వహణాధికారి

## అన్నపూర్ణ క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన బల్దియా కమిషనర్ వెంకన్న

మన మీ వార్త ఆగస్టు 28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి ఆవరణలో బల్దియా సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ అన్నపూర్ణ భోజన కేంద్రాన్ని (రూ. 5 భోజనం)ను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన కేంద్రం (క్యాంటీన్) ద్వారా అందిస్తున్న భోజనం, పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, వడ్డించే విధానం తదితర అంశాలను కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. వినియోగదారులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి ఆహార నాణ్యతను పరిశీలించారు.

అదేవిధంగా క్యాంటీ భోజనం చేస్తున్న వినియోగదారులతో కమిషనర్ నేరుగా మాట్లాడి భోజనం రుచి, నాణ్యత, అందిస్తున్న సేవలు, పరిశుభ్రతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.





రూ.5కే అందిస్తున్న భోజనం నాణ్యంగా, రుచికరంగా ఉండేలా నిర్వాహకులు నిరంతరం శ్రద్ధ వహించాలని సూచించారు.

ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, పేదలు మరియు ఇతరులకు అందుబాటులో ఉండే ఈ సేవలో ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ఆహార పదార్థాలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాఖీ పండుగ వేడుక సందర్భంగా























## హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయికి రాఖీ కట్టిన బాలసదన్ బాలికలు

మన మీ వార్త ఆగస్టు 28వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కి సుబేదారిలోని బాలసదన్ బాలికలు రాఖీ కట్టారు. రాఖీ పర్వదిన ప్రాముఖ్యతను జిల్లా కలెక్టర్ వివరిస్తూ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు, ఆప్యాయతకు అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని వివరించారు. బాల సదన్ బాలికలకు రక్షణగా నిలబడాలని తెలిపారు. ఈ వేడుకలలో బాలికలకు కలెక్టర్ రాఖీ కట్టారు. రక్షాబంధన్ రోజున తనకు రాఖీని కట్టిన బాలికలకు జిల్లా కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాఖి పర్వదిన సందర్భంగా జిల్లా కలెక్టర్ తో కలిసి వేడుకలు జరుపుకోవడం పట్ల బాలికలు ఆనందం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, బాల సదన్ సూపరింటెండెంట్ కళ్యాణి, బాల సదన్ బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ కు రాఖీలు కట్టిన నియోజకవర్గ ఆడపడుచులు

రామంతాపూర్, ఆగస్టు 28 ( మన మీ వార్త):



రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ నివాసంలో ఆత్మీయ రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ మహిళా నాయకురాళ్లు ప్రభాకర్‌కు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా మహిళా నాయకురాళ్లు ప్రభాకర్‌కు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి ప్రతీక అని అన్నారు. నియోజకవర్గ మహిళలు తనపై చూపిస్తున్న ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల భద్రత, సంక్షేమం, సాధికారత కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకురాళ్లు అంబటి భాగ్యలక్ష్మి, తాళ్ల మంగ గౌడ్, బోగాల అరుణ, స్వర్ణ షిండే, శ్రీరామ్ జ్యోతి, సిర్ల అనిత, వంగపల్లి మంజుల వాణి, వల్లపు లావణ్య, మాడవేణి మమత, విజేత సౌధాయ్తో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నా--చెల్లెళ్ల, అక్క--తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ : బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



చిలుక నగర్, ఆగస్టు 28 ( మన మీ వార్త):



అన్నా--చెల్లెళ్ల, అక్క--తమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌కు ఆయన సోదరి వాణి రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరిశాయి. అనంతరం బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాఖీ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు.

## డ్రై ఫ్రూప్ట్స్ తో రాఖీలు తయారు చేసిన చిన్నారి:

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి:



మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన 7వ తరగతి(ఎంజేపీ ప్రభుత్వ హాస్టల్ ) విద్యార్థిని రాజిపేట ఆరాధ్య డ్రై ఫ్రూప్ట్స్ అంజీరా పండు, కిస్మిస్, మఖానా, బాదం, కాజు, పిస్తా, దారం ఉపయోగించి రాఖీలు స్వంత ఆలోచనతో తయారు చేసింది. శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్న ఆదిత్యకు కట్టింది. పప్పులు, ఆకులతో కూడా రాఖీ తయారు చేసింది. వీటిని వృథాగా పారేయకుండా మళ్లీ తినే విధంగా ఉపయోగ పాడుతాయని చిన్నారి ఆలోచన.



ప్లాస్టిక్, రసాయన, కవర్లతో తయారు చేసినవి కొనుగోలు చేసి కట్టడంతో అవి వృథా అవుతున్నాయని తెలిపారు. వాటికీ వినియోగించే డబ్బు డ్రై ఫ్రూట్స్ కు వినియోగించి తిరిగి తినేందుకు దోహద పడుతుందని చిన్నారి ఆలోచన. గత ఏడాది కూడా ఎలాంటి రాసాయనాలు, ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగుంచకుండా కాగితాలు ఉపయోగించి రాఖీలు తయారు చేసి కట్టింది.

## బల్దియా కమిషనర్ వెంకన్నకు
# రాఖీ కట్టిన మహిళా సిబ్బంది

మన మీ వార్త ఆగస్టు 28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బల్దియా మహిళా సిబ్బంది ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ టి.వెంకన్నకు రాఖీలు కట్టి, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ అనేది ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక అని పేర్కొన్న కమిషనర్, బల్దియా కుటుంబ సభ్యులంతా పరస్పర గౌరవం, స్నేహభావంతో పరస్పర సహకారంతో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా సిబ్బంది ఉమ, ఇందిర, జ్యోతి, చందన, మమత తదితరులు పాల్గొన్నారు.

## మట్వాడ పోలీస్ స్టేషన్‌లో రక్షాబంధన్ వేడుకలు

మన మీ వార్త ఆగస్టు28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



మట్వాడ పోలీస్ స్టేషన్ మహిళా పోలీస్ అధికారులు, తోటి అధికారులు మరియు సిబ్బందితో కలిసి పవిత్రమైన రక్షాబంధన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలు పోలీస్ కుటుంబంలో సోదరభావం, పరస్పర గౌరవం, ఐక్యత మరియు స్నేహభావానికి ప్రతీకగా నిలిచాయి. ఈ సందర్భంగా అధికారులు మరియు సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని, పండుగ స్ఫూర్తిని పంచుకున్నారు. తద్వారా పోలీస్ కుటుంబంలో ఐక్యత, నమ్మకం మరియు పరస్పర సహకారం మరింత బలపడింది.

## చిలుకానగర్ శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జంధ్యాల పౌర్ణమి, రాఖీ పౌర్ణమి వేడుకలు



చిలుకా నగర్, ఆగస్టు 28 ( మన మీ వార్త)

: రాఖీ పౌర్ణమిని పద్మశాలి సమాజం అత్యంత పవిత్రమైన లి"జంధ్యాల పౌర్ణమి"లిగా భావిస్తూ తమ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగిస్తోంది. ఈ సందర్భంగా శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం--చిల్కానగర్ ఆధ్వర్యంలో చిల్కానగర్‌లోని శ్రీ మార్కండేయ దేవాలయంలో జంధ్యాల పౌర్ణమి, రాఖీ పౌర్ణమి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా శ్రీ మార్కండేయ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పద్మశాలి కులబంధువులకు పవిత్రమైన జంధ్యాలను శాస్త్రోక్తంగా అందజేసి, జంధ్యాల ధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిల్కానగర్ ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది పద్మశాలి కులబంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. బోడ విద్యాసాగర్‌కు ఘన సన్మానం అనంతరం శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు బోడ విద్యాసాగర్ చిల్కానగర్ ప్రాంత సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కో-కన్వీనర్‌గా, అలాగే మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేపీ చేనేత సెల్ కో-కన్వీనర్‌గా ఎన్నికైన సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సామాజిక సేవ, పద్మశాలి సమాజ సంక్షేమం, సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారం, చేనేత రంగ అభివృద్ధి కోసం బోడ విద్యాసాగర్ మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ఆయన మరింత ముందుకు సాగాలని అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు సకినాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెజగం శ్రీనివాస్, కోశాధికారి పెండెం నాగార్జున, ఉపాధ్యక్షులు అడ్డగట్ల భవానందం, ముఖ్య సలహాదారులు దేవసాని బాలచందర్, దాసరి శ్రీనివాస్, గూడ శ్రీశైలం, కోడం రమేష్, బోడ అశోక్ కుమార్, పాలకుర్తి నవీన్, చిన్నం నవీన్, పెద్దబొమ్మ రమేష్, తాటి సంపత్, పాము ఆంజనేయులు, కుమార్, కనకదుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన మహిళా కమిషన్ సభ్యురాలు శశికళ యాదవ రెడ్డి.

పటాన్ చేరు ఆగష్టు 28 మీ వార్త ప్రతినిధి :

ఆత్మీయ సోదరులు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి గారిని తన నివాసంలో కలిసి రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గోక శశికళ యాదవ రెడ్డి.



# వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- దోమల నియంత్రణకు ప్రతి మంగళ, శుక్రవారం 'డ్రైడే' పాటించాలి
- అన్నారంలో ఇంటింటా అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది
- జ్వరపీడితుల నుంచి రక్త నమూనాల సేకరణ...డెంగీ ర్యాపిడ్ పరీక్షలు
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ ఆదేశాల మేరకు

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగష్టు 28 మీ వార్త









(పానగల్) అన్నారం : వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ ఆదేశాల మేరకు దావాజీపల్లి సబ్‌సెంటర్ పరిధిలోని అన్నారం గ్రామంలో శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ సర్పంచ్ తులస్య సుగూరమ్మకృష్ణ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారిణి మైథిలి, సూపర్‌వైజర్ శాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు రామచందర్, మదన్ గోపాల్ తదితరులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల లార్వా నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించారు.దోమల వృద్ధికి అడ్డుకట్ట వేయాలి: ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రైడే' పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. ఇళ్లలోని పూలకుండీలు, పాత టైర్లు, పాత కూలర్లు, కొబ్బరిబొండాలు, రుబ్బురోళ్లు, ఖాళీ ప్లాస్టిక్ వస్తువులు, పాత కుండలు, పగిలిన మట్టి పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీటి గుంతలు ఉంటే వాటిని పూడ్చివేయాలని సూచించారు.నిల్వ నీటిలో దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉన్నందున పాత నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో నిల్వ నీటిలో, నీటి గుంతల్లో లార్వా నియంత్రణ కోసం అబేట్ ద్రావణాన్ని వినియోగించారు.మలేరియా...డెంగీపై అప్రమత్తత:దోమల కాటు వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది హెచ్చరించారు. దోమలు ఇళ్లలోకి రాకుండా తలుపులు, కిటికీలకు దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు.కలుషిత నీటితో వ్యాధుల ముప్పు,కలుషిత నీటిని తాగడం వల్ల విరేచనాలు, వాంతులు, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటిని వేడిచేసి చల్లారిన తర్వాత తాగాలని సూచించారు. బయట ఆహారం తీసుకోవడాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు,జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, శరీర నొప్పులు, కండ్లకలక, ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యాధికారిని లేదా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. జ్వరపీడితుల నుంచి ల్యాబ్ టెక్నీషియన్ శిరీష రక్త నమూనాలను సేకరించి డెంగీ ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అరుణ, మహేశ్వరి, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు...

# వాట్సాప్, మెయిల్ ఫిర్యాదులకూ స్పందించాలి







- ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండొద్దు
- గరిష్ఠంగా వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి
- విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు 2--3 రోజుల్లోనే ఇవ్వాలి
- పానగల్ గ్రామసభలో అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు
- మండల స్థాయిలోని సమస్యలు పరిష్కారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగష్టు 28 మీ వార్త

వనపర్తి జిల్లా,పానగల్ : ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా సంబంధిత అధికారులకు పంపినా వెంటనే స్పందించి పరిష్కరించాలని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు తమ పనితీరులో మార్పు తీసుకురావాలని స్పష్టం చేశారు.శుక్రవారం పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పానగల్ మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలకు సంబంధించిన ప్రజా సమస్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గత రెండున్నరేళ్లలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు, పరిష్కరించిన సమస్యలు, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించారు.వారం రోజుల్లో పరిష్కారం,ప్రజలు తమ రోజువారీ పనుల్లో బిజీగా ఉంటారని, ఒక చిన్న సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదని మంత్రి అన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల విషయంలో మరింత వేగంగా స్పందించి రెండు, మూడు రోజుల్లోనే పరిష్కరించాలని సూచించారు.

**వాట్సాప్... మెయిల్‌తో ఫిర్యాదు...**

ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా రాసి, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్ పేర్కొని సంబంధిత శాఖాధికారికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా పంపవచ్చని మంత్రి తెలిపారు. వాట్సాప్, ఈ-మెయిల్‌లో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ప్రింట్ తీసుకుని దరఖాస్తుగా పరిగణించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పెండింగ్ ఫిర్యాదులపై ఆరా,ఇప్పటి వరకు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో మంత్రి సమీక్షించారు. ఒక్కో ఫిర్యాదుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌కు కారణాలను అధికారులను ప్రశ్నించి, సమస్యల పరిష్కారానికి మార్గాలను సూచించారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారుల ద్వారా పరిష్కరించారు.



మంత్రి జూపల్లి కృష్ణారావు



జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**భూ సమస్యలపై ప్రత్యేక సమీక్ష...**

రెవెన్యూ సమస్యలపై ముందుగా సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ భూ సమస్యలపై గతంలో సమర్పించిన దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. ఆయా సమస్యలు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లపై కీలక ఆదేశాలు, కొల్లాపూర్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ ఆర్థిక స్థోమత లేక నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తదుపరి సమీక్ష సమావేశంలో ఆయా లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు నాలుగో విడత ఆర్థిక సహాయం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**విద్యుత్ సమస్యలపైనా సమీక్ష...**

విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులను కూడా మంత్రి సమీక్షించారు. ప్రజలు సమర్పించిన సమస్యలను అధికారులు శాఖల వారీగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.అక్కడికక్కడే ఫిర్యాదుల స్వీకరణ,సమీక్షా సమావేశం సందర్భంగా పలువురు ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా మంత్రికి అందజేశారు. వారి నుంచి దరఖాస్తులను స్వీకరించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

**మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం...**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... గ్రామ, మండల స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు మండల స్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు జిల్లా స్థాయి కార్యాలయాల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సమస్యలకు పరిష్కారం చూపాలని మండల స్థాయి అధికారులకు సూచించారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి...**

ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డీఆర్వో తిరుపతయ్య, తహసీల్దార్ కార్తిక్, ఎంపీడీఓ గోవిందారావు, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, పానగల్ సర్పంచ్ నాగలక్ష్మి, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు...

## రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటిన మహిళా కార్మికులు

మున్సిపల్ కార్మిక సోదరీమణులకు చీరల బహూకరించన కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ



**మంచిర్యాల,ఆగస్టు 28 ( మన మీ వార్త జిల్లా ప్రతినిధి ):** రాఖీ పౌర్ణమి సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ మహిళా కార్మిక సోదరీమణుల ఆధ్వర్యంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఆత్మీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు, మున్సిపల్ కార్పొరేటర్ సుధమల్ల హరికృష్ణ పాల్గొని మహిళా కార్మికుల మధ్య రాఖీ పండుగను జరుపుకున్నారు.ఈ సందర్భంగా మహిళా కార్మిక సోదరీమణులు హరికృష్ణకు రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు. తమ మధ్యే ఉండి రాఖీ పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మహిళా కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం మహిళా కార్మిక సోదరీమణులకు హరికృష్ణ చీరలను బహుమతిగా అందజేశారు. మహిళా కార్మికుల పట్ల ఆత్మీయతను చాటుతూ రాఖీ పండుగను వారితో కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ వేడుకలు పరస్పర ప్రేమ, ఆత్మీయత, సోదరభావానికి ప్రతీకగా నిలిచాయి.



# డెంగ్యూ మలేరియాపై అప్రమత్తం

- పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రతి శుక్రవారం 'డ్రైడే' పాటించాలి
- నీరు నిల్వ ఉండకుండా చర్యలు...యాంటీ లార్వా ఆపరేషన్లు నిరంతరం కొనసాగాలి
- 19, 20, 8వ వార్డుల్లో డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగస్టు 28 మీ వార్త

వనపర్తి టౌన్ : డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. దోమల వృద్ధికి అవకాశం లేకుండా ప్రజలు, అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అన్నారు. శుక్రవారం వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 19, 20, 8వ వార్డుల్లో నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పరిశీలించారు. ఆయా వార్డుల్లో మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య చర్యలను ఆయన స్వయంగా పరిశీలించారు.

**దోమల నివారణ చర్యలపై ఆరా...**

వార్డుల్లో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న డెంగ్యూ, మలేరియా నివారణ అవగాహన కార్యక్రమాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సూచనలు, తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే ప్రదేశాలను గుర్తించి చేపడుతున్న యాంటీ లార్వా ఆపరేషన్లను కూడా పరిశీలించారు.










**నీరు నిల్వ ఉండకుండా చూడాలి...**

అధికారులు, మున్సిపల్ సిబ్బందికి అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల వృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా చర్యలను నిరంతరం కొనసాగించాలని సూచించారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నియంత్రణ...**

ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఖీమ్యా నాయక్ సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి శుక్రవారం 'డ్రైడే' పాటించాలని కోరారు. డెంగ్యూ, మలేరియా నివారణలో ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఇంటింటా పరిశుభ్రతకు ప్రాధాన్యం...**

ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని, అందువల్ల నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులు సూచించారు. దోమల లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తించి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌లో నాసిరకం పనులే

- ఐదు రోజులకే డ్రైనేజీ దుస్థితి
- అడుగుభాగం నుంచి నీటి లీకేజీ...నాణ్యతపై కాలనీవాసుల ఆగ్రహం
- క్యూరింగ్ చేయకుండానే పనులు చేస్తున్నారని ఆరోపణ
- ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ మండిపాటు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని 10వ వార్డు వాసుల హెచ్చరిక
- నాణ్యతపై అధికారులు తక్షణమే తనిఖీ చేయాలని డిమాండ్
- బిల్లులు చెల్లించే ముందు పనుల నాణ్యత పరిశీలించాలన్న స్థానికులు

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఆగస్టు 28 మీ వార్త

వనపర్తి జిల్లా,ఆత్మకూరు : అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే ప్రజాధనం వృథా కావడమే కాకుండా నిర్మించిన కొద్ది రోజులకే పనులు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని ఆత్మకూరు మున్సిపాలిటీ 10వ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి హెచ్‌పీ గ్యాస్ వరకు నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ పనులపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**ఐదు రోజులకే లీకేజీ...**

స్థానికుల వివరాల ప్రకారం.. డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన ఐదు రోజులకే అడుగుభాగం నుంచి నీరు బయటకు లీక్ అవుతున్నట్లు ఆరోపిస్తున్నారు. నిర్మాణంలో సిమెంట్, ఇసుక నిష్పత్తి, మిశ్రమం, పనితీరు తదితర అంశాల్లో నాణ్యత పాటించలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన వెంటనే ఇలాంటి పరిస్థితి ఏర్పడటంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**క్యూరింగ్ చేయకుండానే పనులా...?**

డ్రైనేజీ నిర్మాణం తర్వాత అవసరమైన క్యూరింగ్ సక్రమంగా నిర్వహించకుండా పనులను తొందరగా





పూర్తి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కొద్దికాలానికే గోడలు బీటలు వారడం, కూలిపోవడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు అంటున్నారు.

**వర్షాకాలంలో పరిస్థితి ఏంటి...?**

ప్రస్తుతం నిర్మాణంలోనే లీకేజీ కనిపిస్తే భవిష్యత్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీ పరిస్థితి ఏమవుతుందోనని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా నిర్మాణం పటిష్టంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డ్రైనేజీ దెబ్బతింటే మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నాణ్యతపై అధికారుల తనిఖీ ఏది...?**

మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేయాల్సి ఉంటుందని స్థానికులు అంటున్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ నాణ్యతను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం...**

డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని 10వ వార్డు కాలనీవాసులు తెలిపారు. నాసిరకంగా నిర్మించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత పనులను సాంకేతికంగా పరిశీలించి అవసరమైతే పునర్నిర్మించాలని కోరుతున్నారు. నాణ్యతా లోపాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**బిల్లులు ఆపాలని డిమాండ్...**

పనుల నాణ్యతపై పూర్తిస్థాయి తనిఖీ, కొలతలు, సాంకేతిక పరిశీలన పూర్తయ్యే వరకు సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించవద్దని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

**- కాంట్రాక్టర్ అధికారుల వివరణ ఏంటి...?**

డ్రైనేజీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించారా? నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్ నాణ్యతను ఎవరు పరిశీలించారు? పనుల సమయంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ఎన్ని సార్లు తనిఖీ చేశారు? నిర్మాణం తర్వాత క్యూరింగ్ నిబంధనల ప్రకారం జరిగిందా? ప్రస్తుతం కనిపిస్తున్న నీటి లీకేజీకి కారణమేంటి? వంటి ప్రశ్నలకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి...**

డ్రైనేజీ నిర్మాణంపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్మాణ నాణ్యతను సాంకేతికంగా పరీక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అదే విషయాన్ని అధికారులు ప్రజలకు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు...

# ప్రజాసమస్యపై తక్షణ స్పందన..
# ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఆకారపు అరుణ్ పటేల్





- వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ రామ్ రెడ్డి నగర్ కాలనీలో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

రామంతాపూర్, ఆగస్టు 28 ( మన మీ వార్త):

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఆకారపు అరుణ్ పటేల్ ముందుంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రామ్ రెడ్డి నగర్ కాలనీలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కొద్ది రోజులుగా కాలనీలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో స్థానికులు తీవ్రంగా గాయపడటంతో పాటు, వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శివ యాదవ్ ఆధ్వర్యంలోని చిన్న టీం సభ్యులు, కాలనీ ప్రజలు ఆకారపు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన వెంటనే స్పందించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఇచ్చిన హామీ మేరకు అరుణ్ పటేల్ సంబంధిత అధికారులతో కలిసి రామ్ రెడ్డి నగర్ కాలనీలోని ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. రోడ్డు పరిస్థితులు, వాహనాల వేగం, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను అధికారులతో చర్చించి, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ఆయన చొరవతో ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు వేగాన్ని నియంత్రించడంతో పాటు ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఏర్పడిందని స్థానికులు తెలిపారు. ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకురాగానే క్షేత్రస్థాయిలో పర్యటించి, అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ పరిష్కారం చూపిన ఆకారపు అరుణ్ పటేల్‌కు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన చొరవ కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్వేత, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి రాఖీ కట్టిన మహిళా సోదరీమణులు

ఉప్పల్, ఆగస్టు 28 ( మన మీ వార్త):





అన్నా--చెల్లెళ్ల ఆత్మీయతకు, అక్కా--తమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి సైనిక్ పురి లోని ఎమ్మెల్యే నివాసంలో మహిళా సోదరీమణులు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ సోదర--సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనురాగం, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగగా రాఖీ పౌర్ణమికి ప్రత్యేకమైన స్థానం ఉందని పేర్కొన్నారు.

సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలను ఆకాంక్షించడం ఈ పండుగ ప్రత్యేకత అని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో ప్రేమ, ఆత్మీయత, సోదరభావం మరింత పెంపొందేందుకు ఇలాంటి పండుగలు దోహదపడతాయని అన్నారు. ప్రతి సోదరి ముఖంలో చిరునవ్వు వెల్లివిరియాలని, ప్రతి సోదరుడి జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలతో నిండాలని ఆయన ఆకాంక్షించారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆనందంగా రక్షాబంధన్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన మహిళా సోదరీమణులు తమ అభిమానాన్ని, ఆత్మీయతను వ్యక్తం చేశారు. రక్షాబంధన్ వేడుకలతో ఎమ్మెల్యే నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది.

## రాఖీ పండుగపురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి కొండ సురేఖ



మన మీ వార్త ఆగస్టు 28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రపంచవ్యాప్తంగా రాఖీ పండుగను జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం కడుతున్నట్లే ఈ సంవత్సరం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తాను రాఖీ కట్టినట్లు మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా మూడోసారి రాఖీ కట్టడం జరిగిందని, గత మూడు సంవత్సరాలుగా రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి, వారి మనవడికి కూడా రాఖీ కడుతున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై రాష్ట్రంలోని ఆడపడుచులందరి దీవెనలు, ఆశీస్సులు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజలకు మంచి సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి కి మరింత శక్తి, యుక్తి కలగాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు.

అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీర్వాదాలు కూడా తెలంగాణలోని ఆడపడుచులందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. తాను తెలంగాణ ఆడపడుచునని, తెలంగాణలోని ప్రతి కుటుంబం తనను వారి కుటుంబ సభ్యురాలిగా ఆదరిస్తుందని మంత్రి సురేఖ తెలిపారు. అందరి ఆడపడుచుల తరఫున ఈ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని కోరుకుంటున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు.ల

## భద్రకాళి చెరువు వరద నివారణ పనులపై సమీక్ష

మన మీ వార్త ఆగస్టు 28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



భద్రకాళి చెరువు పరిధిలో చేపట్టాల్సిన వరద నివారణ చర్యలు, ముందస్తు రక్షణ పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు నీటి ప్రవాహం, వరద పరిస్థితులు, కాలువలు, నీటి విడుదల మార్గాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరద నివారణ పనులను ముందస్తుగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశానికి వరంగల్ ఆర్డీవో సుమ, ఇరిగేషన్ ఎస్ ఇ రామ్ ప్రసాద్, ఇ ఇ ,కిరణ్ , డి ఇ మధుసూదన్ రెడ్డి, వరంగల్ ఖిలా వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్,ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

## 371 నూతన చేయూత పింఛన్లు దరఖాస్తు అందినట్లు తెలిపిన ఎంపీడీవో కృష్ణమూర్తి.

మనోహరాబాద్ ఆగస్టు 28 మన మీ వార్త.



మండలంలో గల గ్రామాల లో 286 వితంతుల పింఛన్లు 16 ఒంటరి మహిళ పింఛన్లు 50 వికలాంగుల పింఛన్లు 19 కల్లుగీత కార్మికుల పింఛన్లు దరఖాస్తులు నమోదైనట్లు చెప్పారు మండలంలో మొత్తం 371 దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 31 ఆఖరి తేది ఉన్నందున అర్హులైనవారు నిర్ణీత గడువులోగా ప్రతి గ్రామపంచాయతీలో కార్యదర్శులకు దరఖాస్తు అందజేయాలని సూచించారు

## హనుమకొండ స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

– మెప్సన్, న్యూ విజన్ దయాగ్నస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించిన కలెక్టర్

మన మీ వార్త ఆగస్టు 28
వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



హనుమకొండలోని స్కానింగ్ , దయాగ్నొస్టిక్ సెంటర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ



చేశారు.
కాకాజీ కాలనీ లోని మెప్సన్ దయాగ్నస్టిక్ సెంటర్, న్యూ విజన్ దయాగ్నస్టిక్ సెంటర్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ముందుగా మెప్సన్ దయాగ్నస్టిక్ సెంటర్ ను తనిఖీ చేసిన కలెక్టర్ అందులోని అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ గదులను పరిశీలించారు.
దయాగ్నస్టిక్ సెంటర్ లో స్కానింగ్ ల వివరాలను స్కానింగ్ కేంద్రం ప్రతినిధులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ స్కానింగ్ కేంద్రంలో వివిధ రకాల స్కానింగ్ పరీక్షలకు సంబంధించిన ధరల వివరాలను తెలిపే పట్టిక కింద పెట్టి ఉండటంతో స్కానింగ్ కేంద్రం ప్రతినిధులను కలెక్టర్ ప్రశ్నించారు.
స్కానింగ్ పరీక్షల ధరలు పట్టికను స్కానింగ్ కోసం వచ్చే ప్రజలకు స్పష్టంగా తెలిసేలా నిబంధనల మేరకు పెట్టించాలన్నారు. అదేవిధంగా న్యూ విజన్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ను తనిఖీ సందర్భంగా తాళం వేసి ఉండటంతో అక్కడి అండర్ గ్రౌండ్ (సెల్లార్ )ను పరిశీలించారు.
ఈ రెండు దయాగ్నస్టిక్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు బిల్డింగ్ ప్లాన్ ప్రకారం పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను దయాగ్నస్టిక్ కు ఉపయోగిస్తుండడంతో నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్యను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
పార్కింగ్ కోసం అనుమతించిన ప్రదేశాలను ఎవరు కూడా ఇతర అవసరాలకు వినియోగించకూడదన్నారు. ధరల పట్టికను మరియు సేవలందిస్తున్న డాక్టర్ ల వివరాలను ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు.
ప్రతి క్లినిక్ ,ఆసుపత్రి దయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ,పిసిపిఎన్డిటి చట్టం నియమాలను పాటించడంతో పాటుగా బయోమెడికల్ , మరియు కాలుష్య నియంత్రణ మండలి నియమాలను అనుసరించాలని సూచించారు.
అనంతరం జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య కాకతీయ కిడ్నీ సెంటర్, సిద్ధార్థ కార్డియాక్ సెంటర్,వినోద డెంటల్ , మల్లిక చిల్డ్రన్స్ హాస్పిటల్ లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ప్రదేశాన్ని మెడికల్ షాప్ ,మరియు ఇతర అవసరాలకు వినియోగిస్తున్న ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.
ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సందీప్ మరియు రంజిత్ పాల్గొన్నారు

## పెండింగ్ భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి:

– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్ జిల్లా, ఆగష్టు 28(మీ వార్త న్యూస్)

పెండింగ్‌లో ఉన్న భూసమస్యల దరఖాస్తులను ప్రాధాన్యత ప్రాతిపదికన వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి తహసీల్దార్లతో పెండింగ్ భూసమస్యల దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి విచారణను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారుల వినతులను నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. తగిన ఆధారాలు లేని దరఖాస్తులను తిరస్కరించే సమయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. భూసమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, రెవెన్యూ, సర్వే బృందాలు సమన్వయంతో పనిచేసి భూవివాదాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## చిట్టీల పేరుతో రూ.10 లక్షల మోసం:

– ఆర్యవైశ్య సంఘం కార్యదర్శికి 14 రోజుల రిమాండ్

జవహర్ నగర్ ఆగస్టు 28: (వార్త ప్రతినిధి)



చిట్టీల పేరుతో రూ.10 లక్షల మేర మోసానికి పాల్పడిన ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిని జవహర్ నగర్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.
జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... మౌలాలి హౌసింగ్ బోర్డ్ నివాసి, హెచ్.బీ కాలనీ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి అయిన నల్ల రమేష్ (62) చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సాకేత్ ప్రాంతానికి చెందిన ఏ. వెంకటేశ్వర్లు అతని వద్ద రూ.10 లక్షల విలువైన చిట్టీ వేశాడు. దాదాపు 25 నెలల పాటు క్రమం తప్పకుండా చిట్టీ వాయిదాలు చెల్లించిన బాధితుడు, గడువు ముగియడంతో తనకు రావాల్సిన మొత్తాన్ని ఇవ్వాల్సిందిగా కోరాడు.
బాధితుడి ఒత్తిడి మేరకు నల్ల రమేష్ ఇచ్చేందుకుగాను రూ.10 లక్షల చెక్కును అందించాడు. అయితే సదరు చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయగా 'బౌన్స్' అయింది. ఆ తర్వాత ఏళ్లు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితుడు వెంకటేశ్వర్లు జవహర్ నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.
బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జవహర్ నగర్ పోలీసులు పక్కా ఆధారాలతో నిందితుడు నల్ల రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. దీంతో నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఆ మేరకు పోలీసులు నిందితుడిని జైలుకు తరలించారు.

## రక్షాబంధన్ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పండుగ: శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాం







హైదరాబాద్, ఆగస్టు 28 ( మన మీ వార్త):

అన్నా--చెల్లెళ్ల మధ్య ఆప్యాయత, ప్రేమానురాగాలను మరింత పెంపొందించే పవిత్రమైన పండుగ రక్షాబంధన్ అని శాసనమండలి సభ్యుడు, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. రక్షాబంధన్ వంటి పండుగలు కుటుంబ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య ఆధ్వర్యంలో నాంపల్లిలోని జన సమితి కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ పండుగల వెనుక ఉన్న సాంస్కృతిక, సామాజిక విలువలను గుర్తించి, వాటి విశిష్టతను కాపాడే విధంగా వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సోదరీమణులు, తెలంగాణ జన సమితి మహిళా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు ప్రొఫెసర్ కోదండరాంకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. రాఖీలు కట్టిన సోదరీమణులకు కోదండరాం ప్రేమపూర్వకంగా చీరలను అందజేసి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, కార్యాలయ ఇన్‌చార్జి హనుమంతరెడ్డి, జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆశప్ప, వినయ్, నగర ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కోశాధికారి సురేష్, సనత్‌నగర్ ఇన్‌చార్జ్ రమేష్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ హనుమంత్ గౌడ్, లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ ఇస్మాయిల్, జన సమితి నాయకులు సదానంద్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, అంజి, వెంకటేష్, విద్యార్థి జన సమితి నగర అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు





– మహిళా కార్యకర్తలతో కలిసి రాఖీలు కట్టించుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, ఆగస్టు 28 ( మన మీ వార్త):

నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నాచారం, హెచ్‌ఎంటి నగర్ డివిజన్లకు చెందిన మహిళా పార్టీ కార్యకర్తలతో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాచారం, హెచ్‌ఎంటి నగర్ డివిజన్లకు చెందిన మహిళా పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. మహిళా కార్యకర్తలతో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో నాచారం, హెచ్‌ఎంటి నగర్ డివిజన్లకు చెందిన మహిళా కార్యకర్తలు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్ విపత్తుపై కేంద్ర విదేశాంగ మంత్రికి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లేఖ

– భారత రాయబార కార్యాలయ అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడిన వరంగల్ ఎంపీ డా.కడియం

మన మీ వార్త ఆగస్టు 28 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

తెలంగాణ రాష్ట్రనికి చెందిన బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించాలి గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరం చేయాలి బాధితులను స్వదేశానికి తరలించాలి నేపాల్‌లో తెలంగాణ రాష్ట్ర బాధితుల పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వారి యోగ క్షేమాలు తెలుసుకొని సహా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నేపాల్‌లో సంభవించిన విపత్తు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రనికి చెందిన పలువురు గాయపడటం, కొందరు మృతి చెందడం, మరికొందరు గల్లంతైన నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర విదేశాంగ మంత్రి శ్రీ ఎస్. జైశంకర్ గారికి లేఖ పంపించారు. బాధితుల పరిస్థితి, వారి కుటుంబాల ఆందోళనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.
నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం, సంబంధిత కాన్సులర్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం, అవసరమైన చికిత్స, ఆసుపత్రి సదుపాయాలు, మందులు తదితర అత్యవసర



సహాయాన్ని అందించాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.
అలాగే విపత్తులో మృతి చెందిన వారి మృతదేహాలను గుర్తించి, అవసరమైన అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి, భద్రంగా స్వదేశానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు చేర్చే వరకు బాధిత కుటుంబాలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.
గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు కొనసాగించాలి
ఇప్పటికీ ఆచూకీ తెలియని తెలంగాణకు చెందిన వారి కోసం నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ శోధన, సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. భారత రాయబార కార్యాలయం, నేపాల్ స్థానిక అధికారులు, రెస్క్యూ బృందాలు, సంబంధిత ఏజెన్సీలు గల్లంతైన వారి కుటుంబాలతో నిరంతరం సమన్వయం చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.
భారత రాయబార కార్యాలయ అధికారులతోనూ ఫోన్‌లో మాట్లాడిన వరంగల్ ఎంపీ డా.కడియం
కేంద్ర విదేశాంగ మంత్రి శ్రీ ఎస్. జైశంకర్ గారికి లేఖ పంపిన అనంతరం కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం ఉన్నతాధికారులతోనూ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితుల వివరాలు, సహాయక చర్యలు, గల్లంతైన వారి ఆచూకీ, మృతదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.
బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నందున వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, ప్రతి ఒక్కరి ఆచూకీ కోసం అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.
"ప్రతి బాధితుడికి అండగా నిలవాలి"
నేపాల్‌లో చిక్కుకున్న లేదా విపత్తు ప్రభావానికి గురైన తెలంగాణ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా కేంద్ర ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. గాయపడిన వారికి వైద్యం, మృతుల మృతదేహాలను స్వదేశానికి తరలించడం, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఎంపీ డా.కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థినుల మధ్య ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు

మంచిర్యాల, ఆగస్టు 28 ( మన మీ వార్త జిల్లా ప్రతినిధి )

ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. వసతి గృహ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ పండుగ సందడిని తీసుకొచ్చారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా విద్యార్థినులు పరస్పరం రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధం, పరస్పర రక్షణకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని సంక్షేమ శాఖ వసతి గృహ అధికారి డి. చందన తెలిపారు. విద్యార్థినుల్లో సోదరభావం, ఐక్యతను పెంపొందించేలా ఇలాంటి వేడుకలు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. రాఖీలు కట్టుకుంటూ, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ విద్యార్థినులు సందడి చేశారు. దీంతో వసతి గృహంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగిన రక్షాబంధన్ వేడుకలు విద్యార్థినుల్లో ఆనందాన్ని నింపాయి.



బాలికల వసతి గృహంలో విద్యార్థులతో రాఖీ కట్టించుకున్న వసతిగృహ అధికారిని చందన

# జిల్లా విద్యా సదస్సును జయప్రదం చేయాలి: సీపీఎం





**– ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి.. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి**

**నాచారం, ఆగస్టు 28 ( మన మీ వార్త):**

విద్య ప్రజల హక్కు, ప్రభుత్వాల బాధ్యత అని సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 30న ప్రగతినగర్‌లోని లీల సుందరయ్య ఫంక్షన్ హాల్, బాచుపల్లిలో జిల్లా విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాచారం కన్వీనర్ పి. గణేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరుస్తూ విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వైపు నడిపిస్తున్నాయని విమర్శించారు. విద్యారంగం కార్పొరేటీకరణతో ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోందని, దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని అన్నారు. స్వాతంత్ర్యం సాధించి 79 సంవత్సరాలు గడిచినా ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని గణేష్ విమర్శించారు. కొఠారి కమిషన్ (1966) నుంచి నూతన విద్యా విధానం--2020 వరకు విద్యారంగానికి జీడీపీలో కనీసం 6 శాతం నిధులు కేటాయించాలని అనేక కమిషన్లు, కమిటీలు సిఫార్సు చేసినప్పటికీ ప్రభుత్వాలు తగిన నిధులు కేటాయించడం లేదన్నారు. 2022--23లో కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి జీడీపీలో కేవలం 1.09 శాతం మాత్రమే కేటాయించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో 30 శాతం వరకు విద్యకు కేటాయించాలని సిఫార్సులు ఉన్నప్పటికీ, 2025--26లో రాష్ట్రాల సగటు విద్యా కేటాయింపు సుమారు 14.5 శాతం మాత్రమే ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం 2026--27 బడ్జెట్‌లో విద్యకు 9.8 శాతం మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. ఈ గణాంకాలు ప్రభుత్వాలు విద్యారంగంపై తమ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నాయనడానికి నిదర్శనమని అన్నారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, అందరికీ ఉచిత విద్య అందించాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టేందుకు సమగ్ర ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అడ్డుకోవాలని పి. గణేష్ డిమాండ్ చేశారు.

**-----సీపీఎం ప్రధాన డిమాండ్లు:**
ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు అవసరమైన భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను పెంచాలి.
ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.ప్రతి నియోజకవర్గానికి సొంత భవనంతో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి.విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 20 శాతం సీట్లు ఉచితంగా కల్పించాలి.మధ్యాహ్న భోజనం, మెస్ ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లకు నిధులు పెంచాలి.ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి.కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజులపై నియంత్రణ విధించాలి.విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టాలి.ఆగస్టు 30న ప్రగతినగర్‌లోని లీల సుందరయ్య ఫంక్షన్ హాల్, బాచుపల్లిలో జరిగే జిల్లా విద్యా సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ ముఖ్య వక్తలుగా హాజరవుతారని తెలిపారు.విద్యావేత్తలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా విద్యా సదస్సును జయప్రదం చేయాలని పి. గణేష్ కోరారు.ఈ కార్యక్రమంలో సంజీవ, నరేష్, చిన్న, బాలరాజ్, శివ, పాషా, వెంకటేష్, సిద్ధు రెడ్డి, జానయ్య, అభిరామ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ బంధంతో చాటుకున్న హిందూ--ముస్లిం సోదరభావం





**--- మహమ్మద్ రఫీక్ రాఖీలు కట్టిన మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు గాయత్రి గౌడ్, వరలక్ష్మి**

**రామంతాపూర్, ఆగస్టు 28 ( మన మీ వార్త):**

మతాలు వేరైనా మనసులు ఒక్కటేనని, మానవత్వం, ప్రేమ, సోదరభావమే అందరినీ కలిపే బంధమని రాఖీ పండుగ సందర్భంగా రామంతాపూర్‌లో జరిగిన వేడుకలు చాటిచెప్పాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా రామంతాపూర్ డివిజన్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ రఫీక్‌కు కాంగ్రెస్ మహిళా నాయకులు గాయత్రి గౌడ్, వరలక్ష్మి రాఖీ కట్టి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ రాఖీ అనేది కేవలం ఒక దారం కాదని, ప్రేమ, నమ్మకం, ఆప్యాయత, రక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. హిందూ--ముస్లిం ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావానికి ఈ వేడుకలు అద్దం పట్టాయని అన్నారు. రామంతాపూర్ గడ్డపై హిందూ--ముస్లిం సోదరులు, అక్కాచెల్లెళ్లు కలిసి మెలిసి పండుగలను జరుపుకుంటూ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నారని తెలిపారు. మతాలు, ఆచారాలు వేరైనా మనుషుల మధ్య మానవత్వం, ప్రేమ, సోదరభావం ఒక్కటేనని పేర్కొన్నారు.
మహమ్మద్ రఫీక్ ప్రజలందరినీ సమానంగా గౌరవిస్తూ, మత సామరస్యం, సామాజిక ఐక్యత, సోదరభావం మరింత బలపడేలా ముందుకు సాగాలని మహిళా నాయకులు ఆకాంక్షించారు. "హిందూ--ముస్లిం ఐక్యతే మన బలం.. మతాలు వేరు.. మనుషులం ఒక్కటే" అని వారు పేర్కొన్నారు. రాఖీ బంధం ప్రేమకు ప్రతీకగా, ఐక్యతకు సంకేతంగా నిలుస్తుందని తెలిపారు.

# రామంతపూర్ పద్మశాలి సంఘం, శ్రీ భక్త మార్కండేయ శివాలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గాయత్రి హోమం, యజ్ఞోపవీత ధారణ

**– ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**రామంతపూర్, ఆగస్టు 28 ( మన మీ వార్త):**





రామంతపూర్ పద్మశాలి సంఘం, శ్రీ భక్త మార్కండేయ శివాలయం కమిటీ ఆధ్వర్యంలో మార్కండేయ భవన్‌లో గాయత్రి హోమం, యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ గాయత్రి హోమం నిర్వహించడంతో పాటు భక్తులకు యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మశాలి కుల ఇలవేల్పు శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆశీస్సులతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రామంతపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ మాచర్ల రంగయ్య పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొండ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంఘం ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ధర్మ పరిరక్షణకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సిరిసాల విజయ ప్రకాష్, కోశాధికారి కొంగరి బాలచంద్రయ్య, సలహాదారులు పి.వి. రాం నర్సయ్య, గుండ్ల రవీంద్ర కుమార్, ఉపాధ్యక్షులు వర్కల స్వామి, ఏలే రమేష్, సంగిశెట్టి యాదగిరి, సహాయ కార్యదర్శి రాపోలు శేఖర్, సంయుక్త కార్యదర్శి గజం మురళి, సహాయ కోశాధికారి దునుక మురళి, కార్యనిర్వాహక సభ్యులు సంఘం వేణు, మునగపాటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



అలాగే దేవాలయ కమిటీ చైర్మన్ జన్ను వెంకటయ్య, వైస్ చైర్మన్ వర్కాల పెంటయ్య, ఫౌండర్ సకినాల కృష్ణ, రాపోలు రాములు, తిరందాసు వెంకటేష్, గుర్రం అంబయ్య, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వనం యాదగిరి, వైస్ చైర్మన్ రాపోలు రామచంద్రం, ఫౌండర్ చింతల సత్యనారాయణ, తిరందాసు శేషయ్య, చిక్క సత్యనారాయణ, బిక్షమయ్య, వీరేశం, గంజి వెంకటేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సెప్టోలెసెంట్ అంటే ఎవరు?

**డాక్టర్. డి.సి.తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్**

**కరీంనగర్ :** డాక్టర్. డి.సి.తిరుపతిరావు మాట్లాడుతూ సెప్టోలెసెంట్ అంటే 70 సంవత్సరాలు దాటిన పురుషుడు లేదా మహిళ, కానీ సంప్రదాయ పద్ధతిలో వృద్ధాప్యాన్ని అంగీకరించకుండా, జీవితం పట్ల ఉత్సాహంతో, ప్రత్యేకమైన జీవనశైలిని ఎంచుకునే వ్యక్తి.
వారి లక్షణాలు ఇవి: వారు ఎప్పుడూ చురుకుగా ఉంటారు. ఉద్యోగం చేయవచ్చు, చదువుకోవచ్చు, లేదా తమను ఆలోచింపజేసే, ఉపయోగకరంగా అనిపించే ఏదైనా కొత్త కార్యక్రమాన్ని సృష్టించుకోవచ్చు.వారికి కనీసం ముగ్గురు మంచి స్నేహితులు ఉంటారు. వారితో కాఫీ, నీరు లేదా వైన్ తాగుతూ తరచూ కలుసుకుంటారు.వారు విలాసాలకు దూరంగా ప్రయాణిస్తూ కొత్త ప్రదేశాలు, సంస్కృతులను అనుభవిస్తారు. అయితే జీవితంలోని మంచి విషయాలను ఆస్వాదించడం మాత్రం మానరు. జీవిత భాగస్వామి, పిల్లలు, మనవలు–మనవరాళ్లు మరియు బంధువులతో ప్రేమ, గౌరవం, పరస్పర సహకారంతో కూడిన సంబంధాలను కొనసాగిస్తారు.వారు ఆశావాదులు, ఉత్సాహవంతులు. ఎప్పుడూ ఒక కొత్త ప్రాజెక్ట్ లేదా లక్ష్యాన్ని మనసులో ఉంచుకొని జీవితంలో నిలిచిపోకుండా ముందుకు సాగుతారు.ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటారు. అనారోగ్యాలను జీవితంలో భాగంగా స్వీకరిస్తారు. రోజుకు కనీసం 20 నిమిషాలు నడుస్తారు మరియు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటారు.చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కుంటారు.

# మంత్రి జూపల్లికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

**– కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌కు రాఖీలు**

**– ఆత్మీయంగా సాగిన రక్షాబంధన్ వేడుకలు**

**– పానగల్ మండల సమీక్షా సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా రాఖీ పండుగ**

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగష్టు 28 మీ వార్త**



వనపర్తి జిల్లా,పానగల్ : రాఖీ పండుగ సందర్భంగా పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన మండల సమీక్షా సమావేశంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది.



రాష్ట్ర అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖీమ్యా నాయక్‌లకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.మండల సమీక్షా సమావేశంలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో బ్రహ్మకుమారీలు రాఖీలు తీసుకుని వచ్చారు. ముందుగా మంత్రికి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌లకు రాఖీలు కట్టారు.ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్,రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని బ్రహ్మకుమారీలు పేర్కొన్నారు. సమాజంలో సోదరభావం, ప్రేమ, ఆత్మీయత, సేవాభావం పెంపొందాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు.

**ప్రత్యేక ఆకర్షణగా రాఖీ వేడుకలు...**
సాధారణంగా ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సాగిన మండల సమీక్ష సమావేశంలో రాఖీ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్రహ్మకుమారీలు మంత్రి, కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు రాఖీలు కట్టడంతో సమావేశ ప్రాంగణంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారు ఒకరికొకరు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, బ్రహ్మకుమారీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు...

# మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

**కాసిపేట, ఆగస్టు 28 : (మనమీ వార్త మండల ప్రతినిధి)**



మండలంలోని మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య, ఐఏఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను



పరిశీలించారు.విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల వంటగదిని సందర్శించి, విద్యార్థులకు తయారు చేస్తున్న కూరను పరిశీలించి స్వయంగా రుచి చూశారు.విద్యార్థుల విద్యా సామర్థ్యాలను కూడా పరిశీలించిన ఆయన, బేస్‌లైన్ అంచనా ఆధారంగా విద్యార్థులను వారి అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా వర్గీకరించి బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు రెమెడియల్ తరగతులను తప్పనిసరిగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు.

**రాఖీ కట్టి శుభాకాంక్షలు**
రాఖీ పండుగను పురస్కరించుకుని దేవాపూర్ పాఠశాల విద్యార్థినులు అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మల్కేపల్లి సర్పంచ్ కోట్నాక రఘుపతి, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీఓ, మండల విద్యాధికారి, మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సాంపల్లి పాఠశాలలో రాఖీతో చాటిన ఆత్మీయత



**(మన మీ వార్త న్యూస్) : ఆగష్టు 27, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

సోదర బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకను డిచ్‌పల్లి మండలం సాంపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆత్మీయంగా నిర్వహించారు. పండుగకు ముందస్తుగా నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థుల మధ్య అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా బాలికలు తమ తోటి బాలురకు ప్రేమగా రాఖీలు కట్టి, సోదర బంధాన్ని చాటుకున్నారు. రాఖీ కట్టిన అనంతరం విద్యార్థులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడితో కళకళలాడింది.

**అనుబంధానికి ప్రతిరూపం**
రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయత, పరస్పర నమ్మకం, రక్షణ భావనలను మరింత బలపరిచే గొప్ప సంప్రదాయమని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సోదరభావం, ప్రేమ, పరస్పర గౌరవం వంటి విలువలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు.

## సాంపల్లి పాఠశాలలో రాఖీతో చాటిన ఆత్మీయత

(మన మీ వార్త న్యూస్) : ఆగష్టు 27, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



సోదర బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకను డిచ్‌పల్లి మండలం సాంపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆత్మీయంగా నిర్వహించారు. పండుగకు



ముందస్తుగా నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థుల మధ్య అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా బాలికలు తమ తోటి బాలురకు ప్రేమగా రాఖీలు కట్టి, సోదర బంధాన్ని చాటుకున్నారు. రాఖీ కట్టిన అనంతరం విద్యార్థులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడితో కళకళలాడింది.

**అనుబంధానికి ప్రతిరూపం**

రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయత, పరస్పర నమ్మకం, రక్షణ భావనలను మరింత బలపరిచే గొప్ప సంప్రదాయమని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సోదరభావం, ప్రేమ, పరస్పర గౌరవం వంటి విలువలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు.

## సర్పంచ్ కృష్ణనాయక్‌కు రాఖీ కట్టిన మాజీ వార్డు మెంబర్ సైదమ్మ

(మన మీ వార్త న్యూస్) : ఆగష్టు 28



బక్కహెమ్లతండా సర్పంచ్ కృష్ణనాయక్‌కు మాజీ వార్డు మెంబర్ సైదమ్మ రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా సైదమ్మ సర్పంచ్ కృష్ణనాయక్‌కు రాఖీ కట్టి, ఆయనకు శు భాకాంక్షలు తెలిపారు.

## రాఖీ కట్టిన కార్మిక మహిళలు.. కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్ రెడ్డి

**గోదావరిఖని :** రాఖీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం నాడు ఓల్డ్ అశోక్ మేస్త్రి అడ్డా టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మిక మహిళలు హరీష్ రెడ్డి గారికి రాఖీలు కట్టి ఆశీర్వదించారు. హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక భద్రత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని, రానున్న రోజుల్లో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు మహిళలు, కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దిగువ యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జహీద్ పాషా, బక్కి కిషన్, కృష్ణస్వామి, చొప్పరి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, మేకల రామస్వామి, రంగు దుర్గాప్రసాద్, బోట్ల పోషం, రౌతు గణేష్, రిషి, మామిడాల రాము, బోడకుంట వెంకటలక్ష్మి, కదార్ల శ్రీధర్, బండి రాజు, దిడ్డి కుమార్, కొండ సురేష్, నిజం, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన పరుగుల రాణి.

**కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న నల్లవెల్లి ఆనంది బంగారు పతకం సాధించారు. హనుమకొండ జేఎన్ఎం స్టేడియంలో 12 తెలంగాణ స్టేట్ మీట్ సౌత్ జోన్ ఆథెనెటిక్ ఛాంపియన్షిప్ 18 ఇయర్స్ విభాగంలో 400 మరియు 200 మీటర్స్ రాష్ట్రస్థాయి గోల్డ్ మెడల్ సాధించి సెప్టెంబర్ నెల పాండిచేరిలో జరిగే సౌత్ జోన్ నేషనల్ మీట్ కు నల్లవెల్లి ఆనంది ఎంపికైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి కోచ్ సుబ్బారావుఆనందిని అభినందించినారు. ఏఎంసీ చైర్మన్ వైనాల రాజులైన్స్ క్లబ్ చైర్మన్ సాన రామకృష్ణారెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యుడు లయన్ జబ్బార్ ఖాన్, బండ సాయి శంకర్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అనుబంధాల బంధం... రాఖీ ఘనంగా రాఖీ వేడుకలు.

**కమాన్ పూర్ :** అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ కమాన్ పూర్ మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంతో పాటు గుండారం జూలపల్లి పేరా పల్లి రొంపి కుంట నాగారం పెంచికలపేట సిద్ధిపల్లె తదితర గ్రామాల్లో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. దూరప్రాంతాల నుండి వచ్చి ఆయా గ్రామాల్లోని తమ సోదరులకు రాఖీలు కట్టారు. దీంతో సోదరులు తమ చెల్లెలకు అక్కలకు దక్షిణ సమర్పించారు. దీంతోపాటు గ్రామాల్లో రాఖీ పండుగ సందడి నెలకొంది. అలాగే తమ తమ బంధువుల సోదరుల గ్రామానికి వెళ్లేందుకు బస్సులు కిటకిటలాడాయి. ఈ వేడుకల్లో తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడి ఓ ప్రియాంక, ఎంపీ ఓ సౌమ్య, గిదవార్ స్రవంతి, సర్పంచులు పల్లె మాధవి నారాయణ, బంగారు కళ్యాణి మహేష్, పోల్ దాసరి వనిత సాయికుమార్, తదితరులు తమ సోదరులకు రాఖీలు కట్టారు.

## రోప్ స్కిప్పింగ్‌లో పారమిత విద్యార్థుల సత్తా

**కరీంనగర్ :** హైదరాబాద్ అల్మాస్‌గూడలో ఈ నెల 23న తెలంగాణ రోప్ స్కిప్పింగ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-10 విభాగంలో 3వ తరగతి విద్యార్థి సి. హెచ్. ఈశ్వర సాయి, అండర్-8 విభాగంలో 2వ తరగతి విద్యార్థి డి. నిఖిల్ బంగారు పతకాలు సాధించగా, అదే విభాగంలో ఎం. శ్రేయాన్స్ కాంస్య పతకం సాధించాడు. విజేతలను పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీతో పాటు పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

# నార్త్ కళ్యాణపురిలో అంగరంగ వైభవంగా గోర్ బంజారాల తీజ్ పండుగ







----బంజారా సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలతో ఘనంగా వేడుకలు -- భారీగా పాల్గొన్న బంజారా కుటుంబాలు

చిలుకానగర్, ఆగస్టు 28 ( మన మీ వార్త):

గోర్ బంజారాల (లంబాడీల) సంప్రదాయ, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే తీజ్ పండుగను నార్త్ కళ్యాణపురి కాలనీలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బంజారా సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకల్లో బంజారా మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నార్త్ కళ్యాణపురిలో గూగులోత్ రాజన్న నాయక్, బానోత్ వెంకన్న నాయక్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తీజ్ పండుగ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ బన్నాల గీత, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, బంజారా పెద్దలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. నార్త్ కళ్యాణపురిలోని రాజన్న నాయక్ నివాసం వద్ద ప్రారంభమైన కార్యక్రమంలో సుమారు 300 బంజారా కుటుంబాలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. భాజాభజంత్రీల నడుమ, బంజారా సంప్రదాయ ఆటపాటలు, నృత్యాలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి తీజ్ పండుగ ప్రత్యేకతను చాటుతూ నృత్యాలు చేయగా, యువత, చిన్నారులు కూడా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం తీజ్ పండుగకు సంబంధించిన కార్యక్రమాలను పురస్కరించుకుని భారీ ఊరేగింపు నిర్వహించారు. నార్త్ కళ్యాణపురి నుంచి ప్రారంభమైన ఊరేగింపు బాలాజీ ఎన్క్లేవ్ మీదుగా బ్యాంక్ కాలనీ వరకు కొనసాగింది. భాజాభజంత్రీలు, బంజారా సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలతో ఊరేగింపు సాగడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.

ఊరేగింపు బ్యాంక్ కాలనీ పార్కుకు చేరుకున్న అనంతరం తీజ్ నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి వేడుకలను ముగించారు. ఈ సందర్భంగా బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరాన్ని పలువురు పెద్దలు పేర్కొన్నారు. తీజ్ పండుగ బంజారా సమాజంలో ఐక్యత, కుటుంబ బంధాలు, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోర్ బంజారా సమాజానికి చెందిన శ్రీరామ్, నాగేందర్, బద్రు, మోతిలాల్, బద్రు నాయక్, రఘు, విజయ్, రాజు నాయక్, నెహ్రూ నాయక్ తదితరులతో పాటు సుమారు 300 బంజారా కుటుంబాల సభ్యులు పాల్గొని తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు.

# పోచమ్మ నామస్మరణతో పులకించిన దళితవాడ

- అమ్మవారి సన్నిధికి తరలిన బోనాలు... భక్తులతో కిక్కిరిసిన దళితవాడ
- బోనం మోసిన మహిళలు... డప్పుల మోత,పూనకాలతో పోచమ్మ తల్లి కి బోనాలు
- డప్పుల మోతకు యువత నృత్యాలు...పూనకాలతో శివసత్తులు, పోచమ్మ బోనాలకు జనం జేజేలు
- బోనాల సందడిలో పాల్గొన్న ప్రముఖులు

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగష్టు 28 మీ వార్త





వనపర్తి టౌన్ :దళితవాడలో పోచమ్మ బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగింది. మహిళలు నెత్తిన అలంకరించిన బోనాలను మోస్తూ... పోచమ్మ తల్లిని ధ్యానిస్తూ ఆలయానికి తరలివెళ్లడంతో వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను పసుపు, కుంకుమ, వేపాకులు, పూలతో అందంగా అలంకరించారు. నెత్తిన బోనంతో పోచమ్మ తల్లి నామస్మరణతో భక్తులు ముందుకు సాగారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబసభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని మొక్కుకున్నారు.

**డప్పు దరువులతో కోలాహలం...**

బోనాల ఊరేగింపులో డప్పు దరువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల మోతకు యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా.. శివసత్తుల పూనకాలతో భక్తుల్లో భక్తిభావం మరింత పెరిగింది. విన్యాసాలు, మహిళల బోనాల ఊరేగింపుతో దళితవాడలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పోచమ్మ బోనాల వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి బోనాల ఉత్సవంలో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో కొలవడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పోచమ్మ తల్లి దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా దళితవాడలో ఎటుచూసినా పండుగ సందడి కనిపించింది. రంగురంగుల అలంకరణలు, పూలతో ముస్తాబైన బోనాలు, డప్పు దరువులు, భక్తుల నామస్మరణలతో ఆ ప్రాంతమంతా భక్తిమయంగా మారింది. భక్తుల హృదయాల్లో భక్తి భావాన్ని నింపుతూ పోచమ్మ తల్లి బోనాల వేడుకలు కన్నుల పండుగా సాగింది. ఈ కార్యక్రమంలో దళిత మ్యాతారులు, కర్రెమ్మ పోచమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు...

# కాసిపేట ఒకటో గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్

- కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది: నాయకులు

కాసిపేట, ఆగస్టు 28 :(మనమీ వార్త మండల ప్రతినిధి)



సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చేపట్టిన పోరాటం ఫలితంగానే యాజమాన్యం పలు కీలక డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించిందని బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. కాసిపేట ఒకటో గని వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై సింగరేణి యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిగాయని తెలిపారు. ఆగస్టు 27న డిప్యూటీ సీఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చల్లో కార్మికుల పలు డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. ఏఐటీయూసీ నిరంతర పోరాటం, ఒత్తిడి కారణంగానే ఈ అంగీకారాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

**పలు కీలక డిమాండ్లపై అంగీకారం**

కోల్ ఇండియాలో అమలవుతున్న విధానానికి అనుగుణంగా కార్మికులకు లభించే పెర్క్స్‌పై ఆదాయపన్నును యాజమాన్యమే భరించే అంశంపై అంగీకారం కుదిరిందని తెలిపారు. సర్వీసులో ఉండగా సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందించడం, ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించడం వంటి అంశాలపై కూడా అంగీకారం లభించిందన్నారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు చర్యలు తీసుకోవడం, బదిలీల్లో మూడు సంవత్సరాల నిబంధనను తొలగించి ఖాళీల ఆధారంగా చర్యలు చేపట్టడం, అర్హులైన సీనియర్ మైనింగ్ సిబ్బందికి పదోన్నతులు కల్పించడం వంటి అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, దీర్ఘకాలంగా అమలులో ఉన్న వైద్య హాజరు నిబంధనల్లో మార్పులు, సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు వారం రోజుల వరకు చికిత్స, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు తదితర అంశాలపై కూడా చర్చలు జరిగాయని పేర్కొన్నారు.

గనుల్లో భద్రతా సామగ్రిని సకాలంలో అందుబాటులో ఉంచడం, మందమరి--క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కార్మికులకు 9 శాతం హెచ్ఆర్ఏ, పెండింగ్‌లో ఉన్న డిస్మిస్ కేసుల పరిష్కారం, అర్హతలకు అనుగుణంగా మైనింగ్ సిబ్బందికి సర్ఫేస్ ఉద్యోగాలు కల్పించడం వంటి అంశాలపై యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు.

**కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ**

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ వైద్య సదుపాయం అందించడం, పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల కేసులను పరిష్కరించడం, ఉద్యోగులకు ఈవెనింగ్ కాలేజీల్లో సాంకేతిక విద్య అభ్యసించేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వడం వంటి అంశాలపై కూడా అంగీకారం కుదిరిందన్నారు. క్లారికల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, పారామెడికల్, భద్రతా విభాగం, ఎలక్ట్రికల్, మెకానికల్ సూపర్వైజర్ తదితర ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని యాజమాన్యం తెలిపినట్లు పేర్కొన్నారు. వివిధ క్యాడర్ స్కీమ్‌ల సమస్యలను పరిష్కరించడం, మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు నెల రోజుల్లోపు కార్యాలయ ఉత్తర్వులు జారీ చేయడం వంటి అంశాలపైనా హామీ లభించిందన్నారు.

కార్మికులకు సొంత ఇంటి పథకం అమలుకు ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, చట్టబద్ధంగా జరిగే సమ్మెల్లో పాల్గొనే కాంట్రాక్ట్ కార్మికులకు జరిమానాలు విధించబోమని, 'నో వర్క్--నో పే' విధానం మాత్రమే అమలు చేస్తామని యాజమాన్యం అంగీకరించినట్లు నాయకులు తెలిపారు. ఈ గేట్ మీటింగ్ కు పిట్ కార్యదర్శి వడ్లమల్ల రాజేందర్ అధ్యక్షత వహించారు. సహాయ పిట్ కార్యదర్శులు పార్వతి సురేష్, అటికేటి సందీప్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రంజిత్‌కుమార్, అశోక్‌తో పాటు గణేష్, సేగెం శంకర్, వెంకటేష్, అనిల్, భాస్కర్, ధరం తదితరులు పాల్గొన్నారు.

## నైజాంలో ‘ఇరుముడి’ కలెక్షన్ల సునామీ.. రవితేజ కెరీర్‌లో మరో భారీ హిట్!



మాస్ మహారాజా రవితేజ హీరోగా, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం ‘ఇరుముడి’ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. భిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం విడుదలైనప్పటి నుంచి మంచి స్పందన అందుకుంటూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలోని కొన్ని సన్నివేశాలపై వివాదం కొనసాగుతున్నప్పటికీ.. కలెక్షన్ల జోరుపై మాత్రం దాని ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు. ముఖ్యంగా తెలంగాణలోని నైజాం మార్కెట్‌లో ‘ఇరుముడి’ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. తొలి వారంలోనే తెలంగాణ వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏడు రోజుల ముగిసేసరికి నైజాం ఏరియాలో సుమారు రూ.26 కోట్లకు పైగా డిస్ట్రిబ్యూటర్ షేర్ వచ్చినట్లు సమాచారం.తెలంగాణ టూరిజం సాధారణ వర్కింగ్ డే అయిన ఏడో రోజున కూడా తెలంగాణలో దాదాపు రూ.3 కోట్ల మేర వసూళ్లు నమోదు కావడం సినిమాకు ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న లాంగ్ వీకెండ్ ‘ఇరుముడి’కి మరింత కలిసొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదివారం వరకు అదనంగా భారీ వసూళ్లు రాబట్టే అవకాశం ఉండటంతో, తెలంగాణలో రూ.70 కోట్ల గ్రాస్ మార్కును చేరుకోవడంపై అంచనాలు పెరుగుతున్నాయి. ‘ధమాకా’ తర్వాత రవితేజ కెరీర్‌లో ఈ స్థాయిలో మాస్ రీచ్, కలెక్షన్ల జోరు కనిపిస్తున్న చిత్రం ‘ఇరుముడి’ అని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. రవితేజ ఎనర్జీ, ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర నటనతో పాటు శివ నిర్వాణ దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇక సినిమాలోని ‘మల్లెపూల పల్లకి’ పాట చార్ట్‌బస్టర్‌గా మారి ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షిస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్, ఇతర ప్రాంతాల్లోనూ సినిమాకు మంచి ఆదరణ లభిస్తున్నప్పటికీ.. నైజాం మార్కెట్‌లో నమోదవుతున్న రికార్డు స్థాయి వసూళ్లు ప్రత్యేకంగా చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే పలు థియేటర్లలో హౌస్‌ఫుల్ ప్రదర్శనలతో దూసుకుపోతున్న ‘ఇరుముడి’.. ఈ లాంగ్ వీకెండ్ ముగిసే నాటికి ఇంకెన్ని కొత్త రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. రవితేజ అభిమానులు మాత్రం ఈ విజయాన్ని ఫుల్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

## అక్కినేని నాగార్జున బర్త్‌డే స్పెషల్.. ‘కింగ్ 100’ టైటిల్ గ్లింప్స్ అప్‌డేట్



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక ‘కింగ్ 100’ సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.వీశీజఱవం నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు ‘కింగ్ 100’ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్... రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## ‘రేస్ 4’లో ఆమిర్ ఖాన్.. ‘ధూమ్ 3’ దర్శకుడితో భారీ యాక్షన్ థ్రిల్లర్?



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ ‘రేస్’ నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ‘రేస్ 4’ స్క్రిప్ట్ ఆమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచర్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఆమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన ‘ధూమ్ 3’ సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## రాఖీ యాడ్ వివాదం.. ట్రోలర్స్‌కి మరోసారి కౌంటరిచ్చిన కృతి సనన్



రాఖీ పర్వదినం సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఓ ఆభరణాల ప్రకటన సోషల్ మీడియాలో ఇటీవల తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ యాడ్‌లో కృతి ధరించిన దుస్తులు, అలాగే పెంపుడు కుక్కకు రాఖీ కట్టడంపై కొందరు నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే ఈ ట్రోలింగ్‌పై కృతి సనన్ తాజాగా సోషల్ మీడియా వేదికగా మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చారు. తన సోదరి నుపుర్ సనన్‌తో కలిసి రాఖీ పండుగను జరుపుకున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న కృతి ఒక పోస్ట్ పెట్టింది. ఈ ఫొటోలో ఇద్దరి చేతులు మాత్రమే కనిపిస్తుండగా, ఇద్దరూ ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఉన్నారు. (రాఖీ ఫ్యాషన్ కమిటీ ఇంకా సమావేశంలోనే ఉన్నట్లుంది.. కానీ మేం మాత్రం అసలైన విషయాలపైనే దృష్టి పెట్టాం అంటూ) ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టు ద్వారా తన దుస్తులను విమర్శించిన వారికి ఆమె పరోక్షంగా చురకలంటించారు. అంతకుముందు కూడా మహిళల దుస్తుల ఆధారంగా వారి సంస్కృతిని, సంప్రదాయాలను జడ్జ్ చేయడంపై కృతి తీవ్రంగా స్పందించారు. పండుగలలో ముఖ్యం భావోద్వేగాలే తప్ప దుస్తులు కాదని ఆమె స్పష్టం చేశారు.

## నాని ‘ది ప్యారడైజ్’ నుంచి క్రేజీ అప్‌డేట్.. ‘యెష నాగుల’ సాంగ్ వచ్చేది అప్పుడే!



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ ‘ది ప్యారడైజ్’ సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని రెండో సింగిల్ డిజిటల్ లాంచ్‌కు రంగం సిద్ధమైంది. ‘యెష నాగుల’ అంటూ సాగే ఈ పాటను రేపు అధికారికంగా విడుదల చేయనుండగా.. దానికి ముందుగా ఈరోజు సాయంత్రం ఈ సాంగ్‌ను అనిరుధ్ కన్సర్ట్‌లో పాడబోతున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ పాటకు శ్యామ్ లిరిక్స్ అందించగా.. జంగి రెడ్డి, సందీప్ కుమార్ ఆలపించారు. అలాగే సందీప్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ చేయడం విశేషం. ఇదిలా ఉంటే, ఈ చిత్రంలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలీ కులకర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ఖరారు చేశారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512